# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక

**శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా**

ఫోన్ (0863) 2293645, 2293862, 2293280, 2293206, 9299656267

web : www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com



సంపాదక వర్గము

గూడూరి వెంకట రత్నం

డి.జె. బాలకృష్ణ లాల్

డా॥ఎస్. రామతారక పరబ్రహ్మ శాస్త్రి

మిస్. పి. ఇందిరాదేవి

డా॥ యమ్. స్వర్ణముఖి



సంపుటి 34 సంచిక 5

పేజీలు 40

జనవరి 2015

**5సం॥ల చందా రూ. 250**

**2సం॥ల చందా రూ. 120**

**సంవత్సర చందా రూ. 60**

**విడిప్రతి వెల...... రూ. 5**

బ్యాంక్ డ్రాఫ్టు A/C Y.S.C.K.P.M చారిటబుల్ ట్రస్ట్ పేరుతో డ్రా చేయండి.

M.O, బ్యాంక్ డ్రాఫ్టు పంపవలసిన చిరునామా

మేనేజరు

సమర్థ సద్గురు మాగజైన్

శ్రీకాళీగార్డెన్స్ - 522508

printed and published by C.V. Ramana Babu on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh and Published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, Editor DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL


**ఈ సంచికలో ............................... ....... పేజీ**


భద్రవాక్యం ........................................2

శ్రీబాబూజీ ఉవాచ.................................3

అమ్మమాట...............................................5

సన్నిధిలో సంభాషణ ..............................7

యోగవాశిష్ఠము .....................................9

శ్రీకాళీగార్డెన్స్ కార్యక్రమాలు.......................11

నారదుడి శాపం....................................12

పరిప్రశ్నేన సేవయా...............................14

సద్గురు శ్రీయాత్రా దర్శన్.........................15

ఏమని ప్రార్థింపనూ మా గురుదేవుని ............... 17

కన్యాపాత్ర ........................................18

శ్రీకృష్ణకర్ణామృతము.............................20

పరమాత్మ వస్తువు.................................22

గురుభక్తి ..........................................23

డెన్మార్క్‌లో శ్రీబాబూజీ ఆరాధనోత్సవాలు.....25

వెలుగు రవ్వలు ..................................27

హరినామ స్మరణ మరువకు...................29

ముద్గల మహర్షి ...............................30

కులమతాలకు అతీతుడు పరమాత్మ ..........31

సత్సంగామృతం.................................33

హనుమద్వైభవము..............................35

సమర్థ సద్గురునాథుని దివ్య చరిత్ర...........37

విష్ణు కథలు- భక్త కబీర్‌దాస్.................39

## భద్రవాక్యం - పరాశర ప్రసాద్

యత్పరల సకల వాగగోచరం ।
గోచరం విమల బోధ చక్షుషః
శుద్ధ చిద్ఘన మనాది వస్తుయ
బ్రహ్మ తత్త్వమసి భావయాత్మని॥

(వివేక చూడామణి /శ్లో॥256)

పరబ్రహ్మ తత్త్వము బాహ్య అంతరేంద్రియాలకి, మనస్సుకి బుద్ధికి అందేది కాదు. "ఆ విషయం అప్పుడు పుట్టిన పిల్లవాడి తండ్రి కూడా చెబుతాడు" అనేవారు సద్గురుదేవులు. అంతేకాదు ఆత్మవస్తువు అగోచరమని, అవ్యక్తమని, అచింత్యమని, అవ్యావహారమని మన శాస్త్రాలు చెప్పేది యదార్థమే. అయితే నిశ్చయాత్మక బుద్ధి మనస్సుని వశపరచుకుంటే, ఆత్మని నిరూపించే ప్రమాణమే లేదనే వాదాన్ని కూడా నిర్వీర్యం చేయ వచ్చునేమో? అది సాధ్యమేనా?

మనోవృత్తులు రహితం కానంతవరకు అది అసాధ్యమే. మనస్సు సంకల్ప వికల్ప శక్తులు కోల్పోయి, బుద్ధిలో లయమయ్యే ఏకైక సాధనం గురుబోధా శ్రవణం. గురుబోధా శ్రవణము నందు ఆసక్తి కలగాలి కదా! దానిని సాధించాలంటే సద్గురు మూర్తి ప్రసాదించిన లక్ష్యార్థ సాధన చేయాలి. అంతేకాదు ఆత్మ తత్త్వం మనస్సులో స్థిరపడాలి కదా! అది సాధించటానికి సాధనము విచారణ.

గృహస్థాశ్రమంలో ఉన్న సాధకుడు మనస్సు, ఇంద్రియాల ఘర్షణలో ఉంటాడు. దానిని అధిగమించాలంటే మనస్సు ద్వారా ప్రాపంచిక విషయాదులతో కూడిన శబ్ద , స్పర్శ, రూప, రస, గంధాల ఆస్వాదన తగ్గించుకోవాలి. శరీరం నీకు కేవలం ఆవాస క్షేత్రం. శరీరానికి, ఇంద్రియాలకు ఆధారమైనదేదో దానిని విచారణ ద్వారా గుర్తించి, ఆ బ్రహ్మవస్తువును 'నేనే' అనే భావన దృఢమైనప్పుడు నీ దేహ విలక్షణత్వం సాధించినట్లే.

దేహాన్ని నువ్వు ఎట్టి పరిస్థితులలోనూ త్యజించనవసరం లేదు. సమయం వచ్చినప్పుడు అదే నిన్ను వీడుతుంది.

## శ్రీ బాబూజీ ఉవాచ

- పరాశర ప్రసాద్

శ్రీ బాబూజీ మహరాజ్ భక్తులను ఉద్దేశించి మాట్లాడుతూ "భగవద్గీత అక్షర పరబ్రహ్మయోగంలో 'అంతకాలేచ మామేవ స్మరన్ ముక్త్వాకళేబరం యః ప్రయంతి సముద్భావం యాతినాస్త్యత్ర సంశయః' అని చెప్పబడింది. ఇదే విషయాన్ని వివరిస్తూ అంత్యకాలంలో ఎవరైతే భగవనామస్మరణచేస్తారో వారు జన్మరాహిత్యాన్ని పొందుతారు. అది



యదార్థమే. మరి మానవుడు జీవితకాలమంతా శ్రమపడి సాధనచేయడం ఎందుకు? భగవన్నామస్మరణ చేయడం ఎందుకు? ఈ సందేహాలు అందరికీ కలగవచ్చు. అంత్యకాలంలో భగవన్నామస్మరణ చేసినంత మాత్రాన మనస్సు ఆ భగన్నామముపై నిలపాలి కదా అలా నిలిస్తే జన్మరాహిత్యము తప్పక కల్గుతుంది.

కానీ అంత్య కాలంలో మనస్సు పూర్వజన్మ వాసనలచేత దారేషణ, ధనేషణ, పుత్రేషణలచేత మమత్వాన్ని వదులుకోలేరు కదా అంతేకాక, కఫ, వాత, పిత్తములతో మనస్సు భగవన్నామం మీద లగ్నముకాదు. అందువలన అంత్యకాలము వరకు వేచియుండక ముందుగానే మేల్కొని సమర్థులైన సద్గురుమూర్తిని ఆశ్రయించి ఆయన మార్గదర్శకత్వంలో మనస్సును భగవన్నామముపై లగ్నంచేసే మార్గాన్ని తెలుసుకోవాలి.

గురుమూర్తిని ఆశ్రయించినంత మాత్రంచేత మనస్సు భగన్నామముపై నిలవదు. సద్గురుమూర్తి యొక్క బోధను శ్రద్ధగా వినాలి. దానిని మననం చేసుకోవాలి. అలా చేయటంవలన భక్తి కలుగుతుంది. అంతేకాదు సజ్జన సాంగత్యము ద్వారా కూడా భక్తి పెంపొందుతుంది. భక్తిలేని సాధన వ్యర్థం. మంత్రానికి బీజాక్షరం ప్రణవం ఎంతముఖ్యమో సాధనకి భక్తి అంతముఖ్యం. ఎన్ని పూజలు చేసినా, ఎన్ని పుష్పాలు సమర్పించినా ఎంత సేవచేసినా సద్గురుమూర్తికి లేక భగవానుడికి ప్రీతి కల్గించేది నిర్మలమైన మనస్సుతో, శ్రద్ధతో, భక్తితో, ప్రేమతో సమర్పించినదే గొప్పగా పరిగణింపబడుతుంది. గురుమూర్తి యెడల అచంచల భక్తి విశ్వాసం వినయ విధేయతలు కలిగి గురువాజ్ఞాపాలన

చేసినపుడే అది భక్తి అనిపించుకుంటుంది. గురుమూర్తి ఇచ్చిన చనువును అపార్థం చేసుకుని చులకన భావంతో వ్యవహరిస్తే పతనం తప్పదు. అది ఎలా వుంటుందంటే ఒక స్త్రీని మాతృభావంతో చూసిన విధానానికీ వికారభావంతో చూసిన దానికి ఉండే డిఫరెన్స్? మనస్సుని బాహ్య విషయాలపైకి పోకుండా నిగ్రహించగల్గాలి. ఆ ప్రయత్నము చేయలేని వాడు ఆత్మజ్ఞానాన్ని ఎన్నడూ పొందలేడు. ఆత్మజ్ఞానమనేది పొందేది కాదు. లేదా కొత్తగా పొందవల్సిందీకాదు. అది యదార్థంగా ఉన్నదే. ఆత్మజ్ఞానాన్ని పొందాము. పొందుతున్నాము అని మనం చెప్పకుంటే అది ఇంతకు పూర్వము లేదన్నమాట. చీకటిలో వస్తువు ఉంటే అది గోచరించదు. కానీకాంతి ఆ చీకటిని తొలగించగానే ఆ వస్తువు గోచరిస్తుంది. వస్తువు చీకటిలోనూ, వెలుగులోనూ అక్కడే వుంది. అలాగే ఆత్మ వస్తువుగానీ, ఆత్మజ్ఞానముగానీ ఎప్పడూ ఉన్నదే. అది నిశ్చలమైన చిత్తానికి మాత్రమే అందుతుంది. చంచలమైన చిత్తానికి అందదు. తర్క విచారణకి ఆత్మ వస్తువు కానీ జ్ఞానముకానీ అందదు. మానవుడు చేసే సాధన కూడా జ్ఞానాన్ని పొందడానికి చేసే ప్రయత్నం కాదు. నువ్వు ఎంత పరిగెత్తినా నీ తలనీడను నువ్వు అందుకోగల్గుతావా! అలాగే జ్ఞానము కూడా ప్రయత్నానికి అందేది కాదు.

బురదలో కూరుకున్న డైమండ్ ప్రకాశించదు కదా! ఆ లోపము డైమండ్‌ది కాదుకదా! మాలిన్యము అనే ఆవరణ నీ చిత్తాన్ని లేక మనస్సుని ఆవరించి ఉంది. కాబట్టి నువ్వుచేసే సాధన ఆ మాలిన్యాన్ని తొలగించుకోవటానికి అని గ్రహించాలి. మనస్సు భగవన్నామస్మరణపై నిలపాలి. సద్గురు మూర్తిని మానవమాత్రునిగా భావించినా, ఆయన చర్యలను అనుమానించినా నీ మనస్సు నిలువదు. గురుకృప సాధించటానికి త్యాగము అనేది ఒక అర్హత. ఏపని చేసినా ప్రతిఫలము ఆశించక శ్రద్ధగా ఆ పనిని నిర్వహించాలి. దానినే నిష్కామ కర్మ అంటారు. నీ తలమీద వెంట్రుకలు ఎన్నిసార్లు తొలగించినా మళ్ళీ ఎలా మొలకెత్తుతాయో అలాగే గురుకృప సాధించనిదే మీ మనస్సులోని సంకల్పాలు తొలగటం అసాధ్యం. సద్గురుమూర్తికి ఏ రకమైన సేవ చేసినా అది గొప్ప సాధనగా పరిగణింపబడుతుంది. ఇంక ఏ రకమైన సాధన అవసరం లేదు. దేహ సుఖాన్ని విసర్జించైనా సరే గురుదేవుని ఆశ్రయించి సేవచేసిన వారికి బ్రహ్మపదార్థము సులువుగా దొరుకుతుంది.

# అమ్మ మాట

- జపమాల ప్రసాద

## మాయ రోగాన్ని హరించేది ఒక్క సద్గురు దేవుడే!

'మాయ'ని గురించి అప్పుడు మాట్లాడుకున్నాం, ఇప్పుడూ మాట్లాడుకుంటున్నాం. రేపు కూడా మాట్లాడుకుంటాం. ద్వాపర యుగంలో గీతాచార్యుడు మాయని గురించి చెప్పాడు. త్రేతాయుగంలో కూడా మాయని గురించి మాట్లాడుకున్నారు. అప్పుడూ, ఇప్పుడూ కూడా మాయని గురించే చెప్పుకుంటున్నాము.

అసలు 'మాయ' అంటే ఏమిటి? 'యా మా సా మాయ'. 'ఏది లేదో అది మాయ' అని అర్థం. మరి లేనిదాని గురించి ఇంత ఎందుకు చెప్పుకుంటున్నాం? అన్నిటినీ తీసుకుని వెళ్ళి మనం ఆత్మవస్తుకు కలుపుతున్నాం. ఆత్మవస్తువు నిర్వికారం, నిరంజనం, నిర్వికల్పం. అది కదలనటువంటిది. మార్పులేనటువంటిది. ఏ గుణమూ లేనటువంటిది. మరి అటువంటి నిర్గుణమైన విషయం గురించి, మనోవాక్కుకి అందనటువంటిది, సకలేంద్రియాలకి అతీతమైనటువంటిది అయిన దాన్ని గురించి ఇంద్రియసహితులమైన మనం ఎలా తెలుసుకోగలం?

మనకున్న పరికరాలు ఈ పది ఇంద్రియాలే కదా! మరి మనము త్రిగుణాలతో కూడుకున్న మాయచేత ఆవరింపబడ్డాం కదా! మాయకు అతీతుడైన ఆ పరమాత్మను ఎలా తెలుసుకోవాలి?

అందుకనే ఆయన జీవులపై అపారకరుణ కలిగి, తన మాయను స్వీకరించి, తాను కూడా ఇంద్రియ సహితుడై ఉద్భవించాడు. మనం ఆయనని తెలిసికోవటానికై ................

అజోపిసన్నవ్యయాత్మా। భూతానామీశ్వరోపిసన్।

ప్రకృతిం స్వామధిష్ఠాయ।సంభావామ్యాత్మ మాయయా॥ గీ4/6

"నేను పుట్టుక లేనివాడను, నాశరహితమైనవాడను. పిపీలికాది బ్రహ్మ పర్యంతం సమస్త భూతములకు నియామకుడను అయి కూడా త్రిగుణాత్మకమైన నా మాయను అవలంబించి, నా యిష్టానుసారంగా నేను ఉద్భవించుచున్నాను" అని చెప్పుకున్నాడాయన.

'బ్రహ్మ'మనే ఏక వస్తువు దగ్గర 'మాయ' అనేది ఉంటేనే చెప్పకో గలుగుతున్నాము. అయితే ఒక చిక్కు ఉంది. ఈ మాయ లేనిది ఉన్నట్లుగా తోపింపజేసి, అసలు వస్తువుని మరచిపోయేటట్లు చేస్తుంది. భగవంతుడు ఎంత అనాదియో, మాయ కూడా అంత అనాదీను. మరి ఈ మాయని దాటి పరతాత్మను తెలుసుకోవడమెలా?

దానికి కూడా ఆ గీతలో ఆ గీతాచార్యుడే ఉపాయం చెప్పాడు.

దైవీ హ్యేషాగుణమయీ। మమ మాయా దురత్యయా।

మామేవయే ప్రపద్యంతే। మాయా మేతాం తరంతి తే।। గీ7/14

"త్రిగుణాత్మకమైన నా మాయ దైవ సంబంధమైనది. అది సామాన్యులచే దాటశక్యం కాదు. కాని ఎవరు నన్ను శరణు పొందుతారో, వారు యీ మాయను సులభంగా దాటగలరు" అని శెలవిచ్చారు.

మనని తరింపజేయటానికి అవతరించిన మహాపురుషులు సద్గురుమూర్తి శ్రీబాబూజీ. ఇందులో బాబు బిడ్డలం కానివారెవరు?

"నేను నా తపశ్శక్తినంతా దారపోసి యిక్కడ నిక్షిప్తం చేశాను. ఆశ్రమం నా స్వరూపం. ఎన్నో జన్మల పుణ్యం రాశీభూతం అయితే తప్ప ఆశ్రమవాసం లభ్యం కాదు. ఆశ్రమసేవ చేసుకుంటే నాకు సేవ చేసినట్లే.

నీ కంట్లో దూలం తీసుకోలేవుగాని, ఎదుటివాడి కంట్లో నలుసు తీయటానికి చూస్తున్నావు. ఆత్మ విమర్శ చేసుకోండి. ఎదుటివారి తప్పలు ఎంచకండి. అందులోనూ మంచినే చూడండి. మంచినే గ్రహించండి. అందరికీ మంచినే చేయండి" అని శ్రీబాబు చెప్పారు.

నిజమైన సాధకుడికి కావలసిన ప్రశ్నపెట్టారు. "నిరాకారం గొప్పదా? సాకారం గొప్పదా?" అని. పెద్దలైన శ్రీలలితానంద సరస్వతీ స్వామినివారిచేత, శ్రీమతి శేషమ్మగారిచేత ఎన్నో వాదవివాదాలు పెట్టి మనకందరికీ తెలియచెప్పారు.

సాకారం గురించి మాట్లాడేటప్పడు నిరాకారం అందులో దాగి ఉన్నది. నిరాకారం గురించి చెప్పకోవడానికి ఏమీ లేదు.

"బ్రహ్మసత్యం జగన్మిధ్య" అని ఎందుకు తెలియజేశారు? అది తెలుసుకుని అసలైన విషయాన్ని తెలుసుకోమని.

- సశేషం

23.12.85 **సన్నిధిలో సంభాషణ** - పరాశర ప్రసాద్

"నిజమైన భక్తునికి సామాన్య మానవునికివలె చల్లనిగాలిగాని, చల్లని చంద్రకాంతిగాని చందనము గాని సుఖాన్ని ఇస్తాయా తారకం?" అని శ్రీబాబు ప్రశ్నించారు. 'ఇవ్వవు' అని తారకం గారు సమాధానం చెప్పారు.

"మరి భక్తునికి సుఖాన్నిచ్చేది ఏది?" అని ప్రశ్నించి, తిరిగి శ్రీబాబు భక్తులకు బోధ చేస్తూ "పరమాత్ముని కమనీయ ఆకృతి గాని అయన మధురమైన నామంగాని మనస్సుని శాంతింపజేస్తుంది. మనస్సు ప్రపంచంలో ఉంటే గాజు పట్టకము ద్వారా పంపిన కాంతి ఎలా రంగు రంగులుగా కనిపిస్తుందో అలాగే రాగద్వేషాలు, ఈర్ష్య ఆసూయలతో భాసిస్తూ ఉంటుంది. దీనినే నానాత్వము లేక అజ్ఞానము అని పిలువవచ్చు. లైటు వేస్తే చీకటి ఎలా తొలగిపోతుందో అలాగే అజ్ఞానమనే చీకటి తొలగాలంటే భగవన్నామ ధ్యానము ద్వారా ఉద్భవించే జ్ఞానమనే వెలుగు ద్వారా మాత్రమే సాధ్యపడుతుంది.



జ్ఞాన తేజస్సులో చీకటి ఉంటుందా ? సూర్యకాంతిలో చీకటి ఉంటుందాండి? సూర్యకాంతికి అడ్డుగా మబ్బు వస్తే ఆ కాంతిని దర్శించలేరు. అది సూర్యకాంతిలో దోషము కాదు కదా? అలా అనుకుంటే అది మీ మూర్ఖత్వము. అలా అడ్డుగా నిలిచేది మీ అజ్ఞానం. పరమాత్ముని సాకారంగా నిరాకారంగా కూడా ధ్యానించవచ్చు. ఒక రూపాన్ని నీ మనస్సులో చిత్రించుకుని ధ్యానించటమే సాకారా ఉపాసన. భగవంతుని నీలోనే కాకుండా సర్వప్రకృతిలో దర్శించగలగటమే నిరాకార ఉపాసన" అన్నారు.

శ్రీబాబు ఇంకా మాట్లాడుతూ "దీనికి మీకొక దృష్టాంతము చెప్తాను. సాగరము చూడండి ఎంతో విశాలంగా అంతటా నీరు కలిగి ఉంటుంది. అది నిరాకారము. సాగరంలోని నీరుగడ్డకడితే అది సాకారమై

లవణము అని పిలవబడుతుంది. భగవత్తత్వము అనంతమైనది. అది అందుకున్న వాడికి అందుకున్నంత. ఇప్పటికి ఆతత్త్వాన్ని ఎంతమంది అందుకున్నారో? ఎవరు కోరుకున్నది వారికి అందుతుంది.

చూడండి గంగానది ఉందనుకోండి. ఎంతో పవిత్రమైనది. ఆ పవిత్రమైన జలము మీ పాపాలను హరిస్తుందని కదా మీ విశ్వాసము. అయితే ఆ పవిత్రజలాన్ని అందుకునేవారికి వారు తీసుకు వెళ్ళిన పాత్రను బట్టి అందుతుంది. మీరు చెంబు తీసుకువెళ్తే చెంబునిండా లభిస్తుంది. బిందె తీసుకువెళ్తే బిందె నిండా లభిస్తుంది. పెద్ద గంగాళం తీసుకువెళ్తే దాని నిండా స్వీకరించవచ్చు. ఆ గంగా నదిలోనే పూర్తిగా మునిగిన వారికి కావలసినదేముంది? అలాగే భగవత్తత్వాన్ని పూర్ణంగా అందుకోవాలి. ఆ స్థితిని పొందాలంటే విశ్వాసము పూర్తిగా ఉండాలి.

శంకర భగవత్పాదులవారు  అందుచేతనే 'నేను అనేది నీలోనుండిపోతే అత్మ దర్శనాన్ని పొందగలుగుతావు' అన్నారు. 'నేను బ్రాహ్మణుడను, వాడు శూద్రుడును' అనే భావం ఉన్నంత కాలం బ్రహ్మత్వాన్ని పొందలేవు. నీలో నుండి బ్రాహ్మణత్వము లోపిస్తేనే బ్రహ్మత్వము ప్రకాశిస్తుంది. అందరిని సమ దృష్టితో చూడటమే నిజమైన సోషలిజమ్ అంటే. ఏమంటావు చలపతీ?" అని అన్నారు.

నాదబ్రహ్మ రామభక్తి ఉపాసకులు త్యాగరాజ స్వామివారు 24వేల  తత్త్వపూరిత కీర్తనలు; ప్రహ్లాద చరిత్ర; శ్రీకృష్ణ లీలలు తన గాన మాధుర్యంతో భక్తులను పులకింప జేశారు. అటువంటి శ్రీత్యాగరాజస్వామివారి వర్థంతి. పుష్య బహుళ పంచమి అనగా 10-1-2015 శనివారం.

- కామేశ్వరీ ప్రసాద

మొదటి రకం 'అహం' వుదాత్తమైనది, అవిభాజ్యమైనది, శాశ్వతమైనది, విశ్వమంతా సర్వ వ్యాపకమైనది అదే పరమాత్మ. అందుకు భిన్నమైనది ప్రకృతిలో మరియొకటి లేదు 'అహం బ్రహ్మాస్మి' అనే మహావాక్యముపై, యేకాగ్రతతో, ధ్యానము చేయాలి, అంటే బ్రహ్మ తానని గ్రహించటమే అదే సాత్వికాహంకారము.



రెండవ రకమైన అహంకారము 'అహం' (నేను) అనేది ధాన్యపు గింజకొన కంటే సూక్ష్మమైనది, ఒక వెంట్రుకలో నూరవ భాగము కంటే సూక్ష్మమైనది, శాశ్వతమైన వునికి గలది. ఈ రెండు రకాల అహంకారము, జీవన్ముక్తులలో, ముక్తులైన మహర్షులలో గోచరిస్తుంది, అట్టి అహంకారము, మానవులకు స్వేచ్ఛనిస్తుంది కాని బంధించదు.ఈ రెండు రకాల అహంకారము బంధాన్ని కలుగజేయదు, ఈ రెండు రకాల అహంకారము మేలు చేసేది, వుదాత్తమైనది.

మూడవ రకమైన అహంకారము దేహాత్మ భావనతో కూడినది, అంటే శరీరమే నేననే భావన. ఇది అహంకారము యొక్క నీచమైన రూపము. ప్రాపంచిక వ్యక్తులందరిలో, యిలాంటి అహంకారమే గోచరిస్తుంది, ఇదే పునర్జన్మయనే విష వృక్షము పెరగటానికి మూల కారణము; ఇలాంటి అహంకారమునకు లోనైనవారికి వివేచనాశక్తి వుండదు. అనేక మంది వ్యక్తులు యిలాంటి అహంకారమునకు బానిసలవుతారు, వారు తమ మేధస్సును, వివేచనా శక్తిని, పరిశీలనా శక్తిని కోల్పోతారు, ఈ రకమైన అహంకారము చాలా దుష్ఫలితములకు దారి తీస్తుంది. ఈ రకమైన అహంకారమునకు దాసోహమన్న వారు దుష్టభావమునకులోనై, దుష్కార్యములకు పురికొల్పే వివిధమైన కోరికలతో కలత చెందుతారు. ఇది మానవుని పశుప్రాయునిగా మారుస్తుంది ఈ రకమైన అహంకారమును నిర్ధాక్షిణ్యంగా నిర్మూలం చేయాలి. మొదటి రెండు రకాల అహంకారాలలో యీ నీచాహంకారమును నశింపచేయాలి. ఈ నీచాహంకారము క్షీణింప

చేసే కొలది, బ్రహ్మ జ్ఞానము పెంపొందుతుంది.

"మొదటి రెండు రకాల అహంకారముతో, బ్రహ్మత్వమును లేక ఆత్మ జ్ఞానమును పొందటానికి కృషిచేయాలి. నీవు యీ రెండు రకాల అహంకారమును కూడ విసర్జించి, మహోన్నతమైన, మచ్చలేని స్థితిని చేరుకోవటమే, ఆ వినాశమైన బ్రహ్మత్వమును పొందినట్లు, దేహాత్మ బుద్ధిని పారద్రోలి నీవు పరమాత్మ లేక పరబ్రహ్మ యని గ్రహించాలి, ఓ! రామా, అహంకారమనే ప్రతి బంధమును ఛేదించి, సత్యములో ప్రతిష్ఠితుడవై, స్వేచ్ఛలో నివసించు. అహంకారము యొక్క ప్రభావము యెంత బలీయముగా వుంటుందో తెలియ జేసి కథను వివరిస్తాను, నీవు శ్రద్ధాళువై, వినవలసినది".

పాతాళలోకంలో ఇంద్రజాలవిద్యలో నిష్ణాతుడైన సంబార యనే రక్కసుడుండే వాడు. స్వర్గంలోని దేవతలకు కూడ అతనంటే హడలు, ఒక సారి అజేయమైన రాక్షస సేనను దేవతలపై యుద్ధానికి పురికొల్పాడు. ఈ సేనను రక్షించటానికి దమ, వ్యాల, కట యని వికృత శక్తులను (అసురులను) సృష్టించాడు. ఈ అసురులు ముగ్గురికి పూర్వ జన్మంటూ లేదు కనుక వారికెలాంటి మానసిక ప్రతిబంధికములేదు, వారికెలాంటి అహంకారము లేకపోయినా, వారికి మానసిక వికాసములేదు. ఏమీ తెలియని పసిబిడ్డ నిప్పుతో ఆడుకొనేట్లు వీరు ముగ్వురూ మృత్యువంటే భయరహితులై, దేవతలతో యుద్ధము చేసి, వారికి చాలా యిక్కట్లు కలిగించారు.

నిర్విరామంగా యుద్ధం చేయటంలో, వారిలో క్రమేపి 'అహం' పొడచూపింది ఎప్పుడైతే అహంకారము మొలకెత్తిందో, వెంటనే వారిలో ధన సముపార్జన, ఆరోగ్య భద్రత, భోగలాలసత పెంపొంది, యీ శరీరంలో వారి జీవితాన్ని సుదీర్ఘం చేసుకోవాలనే కోరిక విజృంభించింది. ఈ కోరికలు వారి పట్టుదలను సడలించి, మనసులో అలజడి ప్రారంభమైనది. అప్పుడు వారిలో పోరాటమందు అసమర్థత మృత్యువంటే భయము వుత్పన్నమైనది. దేవతలు వారి మానసిక పరిస్థితిని అదునుగా తీసుకొని, భీకర పోరాటం జరిపారు, మృత్యు భయానికిలోనైన ముగ్గురు అసరులూ పారిపోయారు. అప్పుడు దేవతలు అసుర సైన్యాన్ని అణచివేశారు.

- సశేషం

# శ్రీ కాళీ గార్డెన్స్ కార్యక్రమములు

జనవరి 2015

1 గురు : ఆంగ్లసంవత్సరాది. వైకుంఠ ఏకాదశి (ముక్కోటి) ఉత్తరద్వార దర్శనము, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన

5 సోమ : పూర్ణిమ, శ్రీరమణమహర్షి జయంతి - శ్రీసద్గురుపాదపూజ

10 శని : శ్రీ త్యాగరాజస్వామి ఆరాధన

14 బుధ : భోగి పండుగ - శ్రీ సద్గురుపాదపూజ, భక్తసమారాధన. రాత్రి 8గం. శ్రీబాబుకు భోగిపళ్ళుపోయటం.

15 గురు : సంక్రాంతి; శ్రీగురుదశమి - శ్రీసద్గురుపాదపూజ, సత్సంగం, భక్తసమారాధన,

16 శుక్ర : కనుమ పండుగ. పశువుల పండుగ.

19 సోమ : మాస శివరాత్రి

26 సోమ : రథసప్తమి; రిపబ్లిక్ డే

30 శుక్ర : భీష్మ ఏకాదశి, సత్సంగం, శ్రీ సద్గురుపాదపూజ

ఫిబ్రవరి 2015

3 మంగళ : మాఘ పూర్ణిమ, సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన

14 శని : శ్రీగురుదశమి, సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ

17 మంగళ : మహా శివరాత్రి - తె॥జా 3గం.లకు బృందావనంలో శ్రీగురుదేవులకు నమకచమక సహిత అభిషేకం; 5-30ని॥లకు శ్రీసద్గురుపాదపూజ; అనంతరం శ్రీరామలింగేశ్వర స్వామికి సామూహిక ఏకాదశ రుద్రాభిషేకాలు; 11గం.లకు శ్రీరామలింగేశ్వర స్వామికి సహస్ర ఘటాభిషేకం; లక్షబిల్వార్చన; భక్తసమారాధన. సాయంత్రం 6-30ని॥లకు శ్రీ ఉమా రామలింగేశ్వర స్వామివారి సామూహిక కళ్యాణ మహోత్సవం; అనంతరం స్వామివారి నగరోత్సవం.

18 బుధ : అమావాస్య

21 శని : శ్రీలలితానంద సరస్వతీస్వామినివారి ఆరాధనమహోత్సవం సత్సంగం, శ్రీ సద్గురుపాదపూజ

(గత సంచిక తరువాయి) **నారదుడి శాపం** - పాటీలు తిమ్మారెడ్డి

మర్నాడు స్వయంవరం. వివిధ దేశాలనుండి రాజకుమారులు వచ్చి, స్వయంవర మండపంలో తమ తమ యోగ్యతలకు తగిన స్థానాలలో కూర్చున్నారు. వారి మధ్య నారదుడు కూడా కూర్చుని ఉన్నాడు. విశ్వమోహిని వరమాల చేత ధరించి, చెలికత్తెలను వెంటబెట్టుకుని, ఒక్కొక్క రాజకుమారుణ్ణి చూస్తూ వస్తున్నది.

విష్ణు ప్రభావం వలన నారదుడు తనకుతాను ఒక రాజ కుమారుడు లాగ కనిపిస్తున్నాడు; తక్కిన వారికి ఒక ఋషికుమారుడు లాగ కనిపిస్తున్నాడు; రాజ కుమార్తెకు మాత్రం కోతిలాగ కనిపిస్తున్నాడు. ఆమె నారదుడి దాకా వచ్చి, అతన్ని చూసి విరగబడి నవ్వి ముందుకు వెళ్లి మరొక రాజకుమారుడి మెడలో వరమాల వేసింది.

పట్టరాగని ఆగ్రహంతో నారదుడు అక్కడనుంచి లేచి వెళ్ళిపోయాడు. అప్పటి దాకా ఆ సభలో మారువేషాలతో ఉన్న శివకింకరులిద్దరు, "నీ కోతి ముఖాన్ని నీటిలో చూసుకో స్వామీ" అన్నారు. నారదుడు నీటి వద్దకు వెళ్లి చూసుకోగా అందులో తన కోతి ముఖం స్పష్టంగా కనిపించింది.

నారదుడు కోపం పట్టలేక "దుర్మార్గులారా! నన్ను చూసి నవ్విన మీరు రాక్షసులైపొండి. నన్ను కోతి అన్నందుకు కోతుల చేతిలో చావండి" అని వాళ్లను శపించాడు. అప్పటికి నారదుడి ఆగ్రహం చల్లారలేదు. తనకు సహాయం చేయపోగా పరాభవం చేసినందుకు విష్ణువుపై అతనికి చాలా కోపంగా వుంది. సరిగా ఆ క్షణంలోనే విశ్వమోహినిని వెంటబెట్టుకుని విష్ణువు నారదుడు ఉన్న చోటుకి వచ్చాడు.

నారదుడు విష్ణువుతో "మొదటి నుంచి మోసగాడవు. పాలసముద్రం చిలికినప్పుడు విషాన్ని శివుడికిచ్చి, లక్ష్మిని, కౌస్తుభాన్ని కాజేశావు. ఇప్పుడు రాజకుమారుడి వేషంలో వచ్చి యీ రాజకుమార్తెను కాజేసి, నాకు విరహం కలిగించావు. అందుకుగాను మీరిద్దరూ నరజన్మలెత్తి, భార్యాభర్తలై విరహ బాధ అనుభవించండి. నన్ను కోతిని చేసినందుకు నీకాకోతులే శరణ్యమవుతాయి." అంటూ శపించాడు.

"ఆగు! నారదా ఆగు!" అన్నాడు విష్ణువు. ఇంతలోనే ఆ నగరం

మాయమైంది. విశ్వమోహిని స్థానంలో లక్ష్మి నిలబడి ఉంది. "నారదా! మన్మథుణ్ణి జయించిన నీవు ఒక స్త్రీ కోసం ఎలా విరహం పొందావు? క్రోధాన్ని జయించానని విర్రవీగావే! మరి యీ శాపాలన్నీ ఏమిటి?" అని విష్ణువు నారదుడిని అడిగాడు. నారదుడు తన తప్పు తెలుసుకుని విష్ణువు కాళ్ళపై పడి క్షమించమని అడిగాడు. "లే నారదా! విచారించకు. లోక కళ్యాణం కోసం జరగబోతున్నదే నీ నోట శాపాల రూపంలో వెలువడింది. రావణ సంహారంకోసం నేను రాజ పుత్రుడిగా జన్మించి, భార్యా విరహం పొందబోతున్నాను. ఈ శివ కింకరులు అక్షయప్రహస్తులనే రాక్షసులుగా జన్మించి, హనుమంతుడనే వానరుని చేతిలో చావనున్నారు. నేనూ ఆ వానర సహాయంతోనే రాక్షస సంహారం చేయబోతున్నాను" అని చెప్పి లక్ష్మితో సహా అంతర్ధాన మయ్యాడు.

## హైదరాబాదు శాఖ కార్యక్రమములు

1) 31-12-2014 బుధవారం సాయంత్రం 4-30ని॥లకు శ్రీ సద్గురుదేవుల దివ్య మంగళమూర్తి (ప్రతిష్ఠామూర్తి)మరియు అఖండ దీపము ఆశ్రమం ప్రధాన కేంద్రము నుండి బయలుదేరి 1-1-2015 గురువారం ఉదయం హైదరాబాదుశాఖకు చేరును.

2) 22-1-2015 గురువారం నుండి 24.01.2015 శనివారం వరకు ప్రతిరోజు సత్సంగ సమావేశములు ఉదయం 9గం.ల నుండి మధ్యాహ్నం 1 గం. వరకు మరియు సాయంత్రం 4గం. నుండి 6గం. వరకు

3) 25.01.2015 ఆదివారం ఉదయము గం. 10.04 ని లకు శ్రీ సద్గురుదేవుల దివ్య మంగళమూర్తి ప్రతిష్ఠా మహోత్సవము, శ్రీ సద్గురు పాదపూజ. సాయంత్రం 5గం. నుండి 7గం. వరకు సత్సంగం.

4) 26-1-2015 సోమవారం - రథసప్తమి. ఉదయం 7గం.లకు సూర్యపూజ. 8-30ని॥ నుండి 10.30ని॥ వరకు సత్సంగం. 11గం.లకు సామూహిక పూజలు.

# పరి ప్రశ్నేన సేవయా

- పరాశర ప్రసాద్

"ఆస్థికులు 'బ్రహ్మసత్యం జగన్మిధ్య' అంటారు. నాస్థికులైతే 'జగత్ సత్యం బ్రహ్మమిధ్య' అంటారు. ఆ ఇరువురిలో ఎవరూ 'నేను' మిథ్య అనలేరు కదా! ఇద్దరికి 'నేను' సత్యమే. అయితే ఆ 'నేను' ఎవరు అని ప్రశ్నిస్తే చెప్పగలవారెవరు?

భగవంతుని ఆరాధించేవారికిగాని, ఉపాసన చేసేవారికిగాని శాంతి చేకూరవచ్చుగాని వారిలో వెలితి లేక అసంతృప్తి మాత్రం పోదు.



భగవంతుని మందిరంలోనే ఉండవచ్చుగాని, 'నాకు భగవంతుడు దగ్గరయ్యాడు' అన్న భావన మాత్రం కలగటం లేదు. భగవానుడు నీలోనే ఉన్నాడు, నీతోనే ఉన్నాడు అనే విషయాన్ని గ్రహించినప్పుడే శాంతి. ఆదే ఆత్మవిచారణ. నీ గురించి తెలుసుకోకుండా భగవంతుని పట్టుకోవటం అసంభవం. నీవు ఎన్ని క్రియలు, పూజలు చేసినా భగవంతుని నీవాడిని చేసుకో గలవా? అలా చేసుకోలేక పోవటానికి అడ్డుపడేదే జీవత్వము.

దానికి హేతువు మనస్సు, బుద్ధి. ఏపని చేస్తున్నా భగవంతుని ఆరాధనగా భావించి చేస్తే భగవంతునితో తాదాత్మ్యాన్ని పొందగలవు. ఒక విగ్రహాన్ని భగవంతునిగా భావించి, ఒక గదిని మందిరంగా భావించిన నీవు ఈ విశ్వంలో సర్వసృష్టిని భగవంతుని మందిరంగా భావన చేసి, అన్నింటిని ఆయన ప్రతిరూపాలుగా భావనచేస్తే అంతకన్నా కావలసినది ఏముంది?

భగవంతుని ఒక దేవాలయానికి పరిమితం చేయకుండా, ఆయనని నీ హృదయంలో చూడగలిగితే, నీలో ప్రేమ ఉప్పొంగిపోతుంది. అప్పుడు సర్వభూతముల యందు నీకు కలిగే దయకి అంతుంటుందా? నేను భగవంతుణ్ణి పట్టుకోవాలి అనే ఆవేదన కన్నా, ఆ పట్టుకోవాలన్న 'నేను' ఎవరు? అనే విచారణ ద్వారా నీ మనస్సును ఆవరించిన మకిలి తొలగిపోతుంది. ఇది మాత్రం సత్యం. ఈ విషయాన్ని మా రమణుడు చెప్పేవాడు" అన్న శ్రీగురుదేవుల వాక్యం శిరోధార్యం!!

(గత సంచిక తరువాయి) **సద్గురు శ్రీ యాత్రా దర్శన్** -పి. సుధారాణి

తిరిగి బస్సులో బయలుదేరి కాంగ్రా జిల్లాలో ధూమ్రాదేవి (జ్వాలాముఖి) వద్దకు వెళ్ళడానికి ముందుగా ధర్మశాలలో బసచేశాము. అక్కడి నుండి కొంతదూరంలో ఉన్న జ్వాలాముఖి ఆలయం వద్దకు ఆటోలో వెళ్ళాము. 51 శక్తి పీఠాలలో అతి శక్తివంతమైన శక్తిపీఠం. సతీదేవి నాలుక పడ్డ స్థలం. దేవి తొమ్మిది జ్వాలలుగా దర్శనమిస్తున్నది. కావున జ్వాలాముఖిగా ప్రసిద్ధి చెందినది.ం ఆలయం లోపల వివిధ స్థలాలలోతొమ్మిది జ్వాలలు రాళ్ళ మధ్యలో నుండి సహజంగా వస్తాయి. వెలిగించడం, ఆరిపోవడం లేదు. నిత్యమూ జ్వలిస్తూ ఉంటాయి. ముట్టుకోవచ్చు.

అక్కడ చమురు నిధులు ఉండవచ్చునని జవహర్‌లాల్ నెహ్రూ జి.యన్.ఐ శాస్త్రవేత్తలను పరిశోధించమని ఆదేశించారు. నలభై సంవత్సరాలు పరిశోధించినా సమాధానం దొరకలేదు. భక్తులు జ్వాలాజీ అని ప్రేమతో పిలుచుకుంటారు.

స్థలపురాణం -

అమ్మవారి నాలుక ధోలీధర్ అనే స్థలంలో హిమాలయంలో పడింది. ఆ స్థలం కనిపెట్టలేక, నాగర్‌కోట్ (కాంగ్రాజిల్లా)లో చిన్న ఆలయం నిర్మించారు. కొన్ని సంవత్సరాలు తరువాత ఒక గోపాలుడు కొండలో జ్వాలను చూసి భూమిచంద్ర మహరాజ్‌కు చెప్పాడు. ఈ జ్వాల సహజమైనది. ఇంధనాలతో మండేది కాదు. ఆ మహిమ తెలుసుకుని ఆ మహారాజు అరణ్యమధ్యలో ఆలయం నిర్మించాడు.

భోజక వంశం నుండి ఇద్దరు బ్రాహ్మణులను ఆలయ నిర్వహణ కోసం తీసుకు వచ్చారు. వారి వంశస్థులే ఇప్పటికీ ఆలయ నిర్వహణ చేస్తున్నారు. మహాభారతం ప్రకారం పంచ పాండవులు శిథిలమైన ఈ ఆలయాన్ని పునర్నించారు. తొమ్మిది జ్యోతులు, తొమ్మిది జగన్మాత స్వరూపాలకు ప్రతీకగా ఉంటాయి. మొట్టమొదటిది, ముఖ్యమైన మహాకాళి వెండి ఫ్రేమ్‌లో ఆలయ ప్రవేశం వద్ద ఉంటుంది. మిగతా జ్యోతి స్వరూపాలు 2) అన్నపూర్ణ, 3) చండీమాత, 4) హింగ్‌లాజ్ భవాని, 5)వింధ్యవాసిని, 6) మహాలక్ష్మి, 7) అంబిక, 8) సరస్వతి, 9) అంజన.

శివుడు భైరవునిగా దగ్గరలో వెలిశాడు.

మహామహిమాన్వితమైన కొన్ని ప్రదేశాలలో భగవంతుడు ఒక రూపంతో వెలిసి ఉంటాడు. కాని ఆ దైవ ప్రభావం ప్రకటితమవడానికి భక్తులే ప్రథమ కారణం. అటువంటి ఒక భక్తుడు 'ధ్యానుభక్త్' అక్బర్ కాలంలో వెయ్యిమంది తోటి భక్తులతో నందగ్రామం నుండి జ్వాలాజీ దర్శనానికి బయలుదేరాడు. సైనికులు అంతమందిని చూసి చాందినీ చౌక్ వద్ద వారిని అడ్డగించి రాజు వద్దకు తీసుకు వెళ్ళారు. అక్బర్ ప్రశ్నకు ధ్యానుభక్త్ తామందరూ జ్వాలాముఖి దర్శనానికి వెళ్తున్నామని సమాధానం చెప్పాడు.

అక్బర్ ఆ దేవి ఎవరు? ఆమె వలన మీకు ఏమి లభిస్తుంది? అని అడిగాడు. దానికి ఆ భక్తుడు 'అమ్మ సృష్టి స్థితి లయ కారకురాలు. భక్తులు ఆర్తితో సేవిస్తే, ధర్మబద్ధమైన వారి కోర్కెలు తీరుస్తుంది. ఇంధనాలు లేని జ్వాలగా వెలుగుతూ ఉంటుంది' అని సమాధానం ఇచ్చాడు. 'అయితే ఆమె మహిమను చూపించు' అన్నాడు అక్బర్.

'అమ్మ సేవకుడనైన నేను అల్పుడనే కాని అంత శక్తి నాకు లేదు' అన్నాడు ధ్యానుభక్త్. అక్బర్ 'నీ గుఱ్ఱం యొక్క తలను నేను నరుకుతాను. నీ దేవత మహాశక్తివంతురాలైతే, నీ భక్తి స్వచ్ఛమైనదైతే నీ గుఱ్ఱం తల తిరిగి అతికించమని, ఆ దేవిని కోరుకో' అని అంటూ గుఱ్ఱం తలను నరికాడు. ధ్యాను చాలా కలతపడి ఇక చేసేది ఏమీ లేక, గుఱ్ఱం శరీరాన్ని నెల రోజులవరకూ కాపాడమని చెప్పి, జ్వాలాదేవి వద్దకు ప్రయాణమై వెళ్ళిపోయాడు.

నదిలో స్నానం చేసి, అమ్మ వద్దకు వెళ్ళి రాత్రి అంతా ఆర్తితో స్తుతిస్తూ 'నీవు సర్వజ్ఞురాలివి, సర్వవ్యాపివి. మహారాజు నా విశ్వాసాన్ని పరీక్షిస్తున్నాడు. నీ భక్తుని మాట నీవే నిలబెట్టాలి. గుఱ్ఱమునకు ప్రాణం దానం చేసి, నీ ఉనికిని నిరూపించుకో తల్లీ! మహారాజు ముందు ఓడిపోయే బదులు, నా తల నీ పాదాలకు సమర్పించి, నీ వద్దకు చేరుకుంటాను' అని ఒట్టుపెట్టి ప్రార్థించినా ఫలితం లేకపోయేసరికి, ధ్యానుభక్త్ తన ఖడ్గంతో తన శిరస్సు ఖండించుకుని అమ్మ పాదాల వద్ద ఉంచాడు.

- సశేషం

# ఏమని ప్రార్థింపనూ మా గురుదేవుని?

- పెనుమాక నాగేశ్వరరావు

మీ నగుమోము నా కనులారా కడదాకా కననిండూ
మీ చింతనతో మీ సన్నిధిలో మము కడతేరి పోనిండూ
ఉపచారాలే చేసితిమో, ఎరుగక అపచారాలే చేసితిమో
ఒడుదుడుకులలో తోడై ఉంటిరి, మా నీడై మమ్ము కాచితిరీ ॥మీ నగు॥

కోర్కెలు ఉడిగి మేమున్నాము, రెక్కలు అలసి ఒదిగున్నాము
తప్పటడుగులను దిద్దితిరీ తప్పొప్పులను తెలిపితిరీ
పండుటాకులమో, ఎండుటాకులమో మిగిలితిమీ
ఎన్ని జన్మముల పుణ్యమో మరి మీ దరికి చేరితిమీ ॥నీ నగు॥

చనువుతోనో, చొరవతోనో, తెగువతోనో, తెలివితోనో
మీతో చెప్పుతున్నాము, మనసు విప్పి అడుగుతున్నాము
చేతులెత్తి వేడుచున్నాము, మిమ్ము కోరుచున్నామూ
శిరస్సు వంచి మొక్కుచున్నాము ॥మీ నగు॥



# కన్హోపాత్ర

- దేవరకొండ శేషగిరిరావు

మంగళవేఢ్య అనే గ్రామంలో వేశ్యల ఇంట కన్హోపాత్ర జన్మించింది. ఆమె ఎంతో సౌందర్యవతి. ఆనాటి బీదర్ నవాబు ఆమె అందం గురించి ఆనోట, ఈనోట విని, తన ఆస్థానానికి రమ్మని, ఆస్థాన నర్తకిగా నియమిస్తానని, ఎన్నో కానుకలు ఇస్తానని ఆశ చూపాడు. అంగీకరిస్తే చేబడతానని కూడా కబురు పంపాడు. వేశ్యల ఇంట జన్మించినప్పటికి కన్హోపాత్ర ధనానికి మానాన్ని అమ్మిన అభాగిని కాదు. పరమేశ్వరుని మంగళరూపంతో పోలిస్తే తన రూపమెంత? ఈ రూపంతో మామూలు మనుష్యులను తృప్తి పరచడమా! ఈ విధమైన భావనతో ఆమె నవాబును తిరస్కరించింది. భగవంతునికి అర్పించే షోడశోపచారాలలో నృత్యం ఒకటి. కన్హోపాత్ర తన నృత్యంతో భగవంతుని నిత్యం భక్తిశ్రద్ధలతో సేవించేది.

ఒకనాడు ఏకాదశి ఉత్సవంలో పాండురంగణ్ణి సేవించడానికి తాళమృదంగ వాద్యాలను మ్రోగిస్తూ, భజనలు చేస్తూ ఉన్న యాత్రికుల బృందాన్ని కన్హోపాత్ర చూసింది. 'ఎక్కడికి వెడుతున్నారు?' అని ఆమె వారిని అడిగింది. 'పండరీపురం' అని వారు జవాబిచ్చారు. 'పాండురంగణ్ణి చూడటానికా?' అని ప్రశ్నించింది. 'రంగణ్ణి కీర్తిస్తూ పాటలు పాడండి, నేను వింటాను' అన్నది. ఆమె భక్తిని చూసి వారు 'నీవు కూడా మాతో రావచ్చు కదా!' అన్నారు. 'నేను మీతో వస్తే రంగడు సమ్మతిస్తాడా?' అని కన్హోపాత్ర ప్రశ్నించింది. 'సందేహమెందుకు? రంగనికి కావలసింది భక్తికాని, జాతితో సంబంధం లేదు' అన్నారు వారు.

అయస్కాంతం దగ్గరకు ఇనుము ఎంత సహజంగా ఆకర్షింపబడుతుందో, అంతే సహజంగా కన్హోపాత్ర పాండురంగని పట్ల ఆకర్షితురాలై తన తల్లిని కూడా రమ్మనమని తీసుకువెళ్ళింది. పండరీపురం చేరగానే రంగని పాదాలపై వ్రాలిపోయింది. తన అంతిమ లక్ష్యం అతడే అనే ప్రగాఢ విశ్వాసం ఆమెలో కలిగింది. ఎన్నో రోజులు ఆలయంలో గడిపింది. ఎన్నో అభంగాలు వ్రాసింది. ఆమె కవితలు చమత్కార్యంతో ఉంటాయి. "ప్రాపంచిక వాసనలు నన్ను బాధించటం లేదు, నీ పాదపద్మాలనే నిధులు దొరికితే వాటితో (ప్రాపంచిక విషయాలతో) పనేమిటి?" అని ఒక అభంగంలో ప్రశ్నించింది.

బీదర్ నవాబును తిరస్కరించినది కదా! తిరస్కరించిన కొద్దీ కామం, క్రోధంగా మారుతుంది. ఆమెను ఏ విధంగానైనా వశం చేసుకోవాలని భావించాడు. కాని ఆమె అంతరిక సౌందర్యాన్ని అర్థం చేసుకోలేక పోయాడు. పండరీపురానికి భటులను పంపి, బలవంతంగానైనా ఆమెను తీసుకు రమ్మనమని ఆజ్ఞాపించాడు.

తనను బంధించటానికి రాజభటులు వస్తున్నారన్న వార్త తెలుసుకుని, కన్హోపాత్ర రంగని ఆలయంలో గర్భగృహంలో దాక్కుంది. రాజభటులు అంతా గాలించి, ఆమె గర్భాలయంలో ఉందని గ్రహించి, "నీ అంతట నీవు బయటకు రాకపోతే బలవంతంగానైనా తీసుకుపోతాం. మర్యాదగా బయటకు రా" అన్నారు. "సరే పండరినాధుని సెలవు గైకొని వస్తాను. బయట వేచి ఉండండి" అని గర్భాలయంలో నుంచి కన్హోపాత్ర చెప్పింది. రాజభటులు ఆమె రాకకై బయటనే ఎదురుచూడ సాగారు. కాని ఎంతసేపటికీ ఆమె రావటం లేదు.

గర్భాలయంలో కన్హోపాత్ర "నన్ను వెంటనే నీలో ఐక్యం చేసుకో తండ్రీ! ఈ సంసార కూపం నుండి ఉద్ధరించు రంగా!" అని విలపిస్తూ "ఓ దీనజనబంధూ! ఓ పతిత పావనా! ఎందుకు నీ భక్తులను బాధిస్తావు? నీ భక్తులు నీ ప్రతిరూపాలు కాదా? సింహానికి దక్కవలసిన మాంసాన్ని నక్క అపహరిస్తే ఎవరిని నిందించాలి? ఎక్కడికి వెళ్లను? ఎవరిని ఆశ్రయించను? నాకు నామరూపాలు లేకుండా చేయలేవా?" అని తన చివరి అభంగంలో ఎలుగెత్తి ఏడ్చింది.

శరీరాన్ని మనస్సును తన సర్వస్వాన్నీ పాండురంగనికే అర్పించిన కన్హోపాత్రను ఆ కమనీయ విగ్రహుడు అనుగ్రహించాడు. స్వామి స్వీకరించాడు. ఆమె ప్రాణాలు అనంత వాయువులలో కలిసిపోయాయి. ముఖంపై చెరగని చిరునవ్వు అట్లాగే మిగిలి ఉంది. తృప్తితో కూడిన మందహాసమది. అమాయకమైన చిన్నపిల్లల మనస్తత్వం కలిగిన ఆమెకు వైకుంఠ ద్వారాలు తెరుచుకున్నాయి. తన స్వధామానికి తాను చేరుకుంది. పాండురంగాలయానికి దక్షిణంవైపు ఆమెను సమాధి చేశారు. అక్కడ ఒక వింతచెట్టు మొలిచింది. ఈనాటికీ అదేమిటో ఎవరికీ అంతు పట్టడం లేదు. ఆ చెట్టునెవ్వరూ ఇంతకు ముందు చూడలేదు, చూడబోరు. ఆ లీలకు అర్థం ఏమిటో ఎవరికీ తెలియదు.

## శ్రీకృష్ణ కర్ణామృతము

- సుశీలా ప్రసాద

37. యావన్నమే నిఖిల మర్మదృఢాభిఘాత
నిస్సన్ధి బన్ధన ముదేతి నకోపతాపః వో
చన్ద్రాతప దిగుణితా మమ చిత్తధారా

తాత్పర్యం -

ఓ కృష్ణా! మర్మస్థానములలో విశేషంగా కొట్టి యమదూతలు నన్ను వారింపక ముందే నా చిత్తమునకు నీ మోము చూపి అమృతముగా చేయుము.



"తమ్ముడూ! ఇవాళ నేను నాయనగారితో చేనుకు వెళ్ళి పాలుపోసుకుంటున్న లేతలేత ధాన్యం కంకులు కమ్మగా తిని వద్దామనుకుంటే తీరా నువ్వు నాతో గోవులను తోలుకుని బృందావనానికి రమ్మన్నావు. ఏమైనా విశేషం ఉందా?" అని బలరాముడు అడిగాడు.

"ఈ లోకపు రుచులకన్న మిన్నయైన పరమార్థ అమృతాన్ని నీకు అనుభవం చేయటానికి నిన్ను రమ్మనమన్నాను అన్నయ్యా!" అన్నాడు కన్నయ్య.

గోవులను మేపుతుండగానే ఎండెక్కింది. అన్నాలు తినే వేళ అయింది. అన్నాలు తిని అంతా అలా రవ్వంతసేపు చెట్లనీడలో మేను వాల్చారు. కన్నయ్య ఉంటే నిద్ర ఎక్కడిది? ఎవరికీ కునుకు రాలేదు. అప్పుడే "అంతా దొంగాట ఆడదాం రండిరా!" అన్నాడు కన్నయ్య. అందరూ చెంగు చెంగున లేచారు. "ఒకడు దొంగగా ఉండండి. మిగతా అందరం దాక్కుందాం" అన్నాడు నల్లనయ్య.

అందరూ ఎవరిదారిన వారు పరుగెత్తారు. కన్నయ్య కూడా పెద్ద మర్రి చెట్టు చాటున దాక్కున్నాడు. ఒక కొత్తవాడు కనిపెట్టినట్లున్నాడు కాబోలు, వెంటనే ఆ చెట్టు దగ్గరకి వెళ్ళి పట్టుకోబోయాడు. కన్నయ్య పరుగెత్తాడు. ఆ వెనుకాలే కొత్తవాడు పరుగెత్తాడు.

కావాలనే చేశాడో జరుగవలసినదే జరగిందో మరి కన్నయ్య కాల్లో ముల్లు గుచ్చుకుని నేలమీద చతికిల బడ్డాడు. ఆ దొంగ వెళ్ళి చటుక్కున పట్టుకున్నాడు కన్నయ్యను. ముల్లుగుచ్చుకున్న నొప్పిని అభినయిస్తుంటే, కాల్లో ముల్లు తీసే నెపంతో పాదం పట్టుకున్నాడు. వాడు ముల్లు తీసి నెత్తురు వస్తుంటే తన తలపాగా చింపి కట్టుకట్టాడు. నడవ లేకపోతున్న కన్నయ్యను ఎత్తుకుని మిగతా పిల్లల దగ్గరకి తీసుకువచ్చాడు. పిల్లలంతా కన్నయ్యని చూసి బాధ పడ్డారు. వాడు కూడా ఏడుపు ముఖం పెట్టాడు. "ఇంక నువ్వు పోరా!" అన్నాడు కన్నయ్య. వాడికి వెళ్ళాలని లేదు.

అప్పుడే సరిగా ఎక్కడి నుంచి వచ్చిందో, ఒక పాము వచ్చి కరచింది వాడిని. నురగలు కక్కుతూ పడిపోయాడు. కన్నయ్య జాలిగా వాడిని బ్రతికించాలంటూ దగ్గరలోనే ఉన్న ఏవో ఆకులు చూపించి, "మీరంతా తలో గుప్పెడు ఆకులు కోసుకు రండిరా" అన్నాడు. వాటి పసరు పిండి వాడి నోటిలో పోయించాడు. కదలకుండా పడి ఉన్నవాడు రవ్వంత రసం నోటిలో పోయగానే వాడిలో కదలికలు ప్రారంభం అయ్యాయి. ఒక చెయ్యి ఒణుకుతోంది. కన్నయ్య వాడి చేతిని గట్టిగా పట్టుకున్నాడు. కన్నయ్య స్పర్శతో వాడు కోలుకున్నాడు. వాడు లేచి కూర్చుని కన్నయ్యను చూసి బావురుమని ఏడ్చాడు.

"ఏడవకురా! నీకేం భయం లేదు. నేనున్నాను నీకు" అన్నాడు కన్నయ్య వాడిని దగ్గరగా చేరదీసుకుంటూ. "నువ్వు ఎవరివో, ఎందుకు వచ్చావో అంతా నాకు తెలుసుగాని, నీ గురించి వీరందరికీ వివరంగా చెప్పు వింటారు" అన్నాడు కన్నయ్య.

వాడు చెప్పడం ప్రారంభించాడు. "నా పేరు మయూరుడు. నేను మధురా నగరంలో పుట్టి పెరిగిన రాక్షసజాతికి చెందినవాడను" అనగానే దగ్గరగా కూర్చున్న పిల్లలంతా రాక్షసుడనే భయంతో కాస్త దూరంగా జరిగారు.

కన్నయ్య నవ్వుతూ "భయం లేదురా. వీడింక రాక్షసుడు కాదు. మీకేం భయం లేదు. ఇంకా చెప్పరా మయూరా" అన్నాడు కన్నయ్య.

- సశేషం

# పరమాత్మ వస్తువు

సేకరణ - మురళీ

(6-11-1972 శ్రీబాబు దివ్యబోధామృతం)

నీరును నాచు కప్పి ఉంటుంది. బియ్యపుగింజను పొట్టు కప్పి ఉంటుంది. అలాగే మానవుడు అహంకార మమకారాలనే పొరలతో



కప్పబడి ఉంటాడు.నాచును తొలగించిగాని నీటిని తీసుకోలేము. పై పొట్టును తొలగిస్తేగాని బియ్యపు గింజ లభించదు. అలాగే అహంకార మమకారాలనే పొరలు తొలగించుకొన్న మానవుడే మహనీయుడు.

సద్గురుమూర్తి ప్రసాదించిన లక్ష్యార్థమునందే మనస్సు నిలిపి దానిని పొందినప్పుడే జ్ఞానాన్ని తెలుసుకున్నట్లు. ఎవరైనా వేదము చదివితేనే ముక్తిని పొందుతారా? లేదు. పరమాత్మ వస్తువుకు త్వక్, కర్మేంద్రియాలు, జ్ఞానేంద్రియాలు ఏమీ లేవు. అది దివ్య తేజస్సు. చీకటికి వెలుగులో లయించటమే దాని స్వభావము.

అలాగే ఈ దివ్య తేజస్సు సమస్త అజ్ఞానాన్ని తొలగిస్తుంది. ఆ అజ్ఞానానికి అతీతమైనది పరమాత్మవస్తువు. దానిని తెలుసుకోవటానికి ప్రతిమానవునికీ హక్కు ఉంది. పరమాత్మ వస్తువుకు స్థూలసూక్ష్మ కారణ దేహాలు ఏమీ లేవు. బంగారం రూపాన్ని ప్రకాశింపజేస్తుంది. కాని ఆ రూపం బంగారాన్ని ప్రకాశింపజేస్తుందా? లేదు. అలాగే పరమాత్మ వస్తువు కూడా. స్వయం ప్రకాశం. దాన్ని ఏదీ ప్రకాశింపజేయదు. అదే అన్నిటినీ ప్రకాశింపజేస్తుంది. అదే ఆత్మానుభూతిని కలిగించి, సర్వబంధాలను తొలగిస్తుంది.

అట్టి పరమేశ్వరుడు సర్వదా రక్షించుగాక!!

# గురు భక్తి

- స్వామి జ్ఞానానంద

మొగలాయి చక్రవర్తి ఔరంగజేబ్ కించుత్తు కూడా పరమత సహనంలేని వ్యక్తి. అతడి పాలనలో పరమతస్థులు భరించలేని బాధలకు, కష్టాలకు గురి అయ్యారు. ఆయన ఆదేశం ప్రకారం ఇస్లాం మతం స్వీకరింప నిరాకరించిన సిక్కుమత గురువైన తేజ్‌బహదూర్ క్రూరాతి క్రూరంగా హత్య చేయబడ్డాడు.

అంతటితో ఔరంగజేబ్ తృప్తి చెందలేదు. ఆ మృతదేహానికి చేయవలసిన అంత్యక్రియలు కూడా జరుగకూడదని అతడు తీర్మానించాడు. “తేజ్‌బహదూర్ దేహం క్రుళ్ళి మట్టిలో కలసిపోవాలి. దానిని ఎవరూ తీసుకెళ్ళకూడదు” అనే ఉత్తర్వు జారీచేసి, కట్టుదిట్టమైన కాపలా కూడా ఏర్పాటు చేశాడు.

గురుగోవింద్‌సింగ్‌కు అప్పుడు పద్నాలుగేళ్ళు. అతడు ఎలాగైనా తండ్రి అంత్యక్రియలు నిర్వర్తించాలని పంజాబ్ నుంచి ఢిల్లీకి బయలు దేరారు. “క్రూరుడైన ఔరంగజేబ్ గురుగోవింద్ సింగ్‌కు కూడా ఎంతటి అఘాయిత్యాన్నైనా తలపెట్టగలడే!” అని జనులందరూ కలత చెందారు. కాని దృఢ నిర్ణయంతో బయలుదేరి వెళ్ళిన గురుగోవింద్‌ను నివారించే శక్తి ఎవరికీ లేదు.

ఢిల్లీ నగరానికి చేరడానికి ఇంకా కొన్ని మైళ్ళు ఉండగానే సిక్కు మతానికి చెందిన ఒక గుఱ్ఱపు బండివాడు, అతడి కుమారుడు గోవింద్ సింగ్‌ను చూశారు. వారు మరీ బ్రతిమాలడటంతో అక్కడ గోప్యంగా ఉండటానికి సమ్మతించాడు. తనూ, తన కుమారుడు ఎన్ని పాట్లుపడ్డా గురుదేవుల దేహాన్ని తెచ్చి ఇస్తామని ఆ బండివాడు కృతనిశ్చయంతో చెప్పాడు. బండివాడుగా ఉంటేమాత్రం ఏమిటి? సిక్కుల వీర సాంప్రదాయాన్ని పుణికి పుచ్చుకున్న వ్యక్తి కదా అతడు!

తండ్రీ కొడుకులు ఢిల్లీ చేరుకున్నారు. గురు తేజ్‌బహదూర్ కాయం ఉన్న చోటు కనుక్కోవటం అంత సులభం కాదు. అయినప్పటికీ ఎంతో శ్రమకోర్చి గురుదేవుని దేహాన్ని ఉంచినచోటుని తెలుసుకున్నారు. ఇంతలో ఆ దేహం కుళ్ళి దాన్నుండి దుర్వాసన రాసాగింది. కావలివారు కూడా కొంత దూరం వైదొలగి, జూదక్రీడలలో మునిగి ఉన్నారు. జనులు

ఆ వైపుగా వెళ్లడం మానుకున్నారు.

తండ్రీ కొడుకులు ఆ చోటును చేరుకున్నారు. పరిస్థితిని అవగతం చేసుకున్నారు. తండ్రి కుమారుడితో "నాయనా! మనిద్దరిలో ఎవరైనా ఒకరు ఖచ్చితంగా ప్రాణాలు కోల్పోవాలి. ఎందుకంటే ఈ దేహన్ని అపహరిస్తే ఆ చోట మరోదేహాన్ని ఉంచక తప్పదు. లేకపోతే దేహం అపహరింప బడినదని అందరికి తెలిసిపోతుంది. సిక్కులందరికీ ఏకైక ఆధారంగా ఉన్న గురుగోవింద్‌సింగ్‌ను, ఔరంగజేబ్ అంతం చేస్తాడు. నువ్వా యువకుడివి. నీకు దేహ దార్ఢ్యం ఉంది. కాబట్టి గురుదేవుని దేహాన్ని నువ్వే తీసుకువెళ్ళు, నేను మరణిస్తాను" అన్నాడు.

కుమారుడు సమాధానం చెప్పేలోపే, తండ్రి తన చేతిలోని కత్తితో తనను పొడుచుకుని మరణించాడు. కుమారుడు తండ్రి మృతదేహాన్ని గురు తేజ్‌బహదూర్ మృతకాయం ఉన్నచోట ఉంచాడు. తేజ్‌బహదూర్ మృతదేహాన్ని మోసుకుంటూ ఎటువంటి ఆటంకమూ లేకుండా, గురుగోవింద్‌సింగ్ వద్దకు వచ్చి చేరుకున్నాడు. ఆహా! ఎంతటి నిరుపమానమైన గురుభక్తి!

## సంసార బంధనాలు లెక్కలేనన్ని!

'ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక జీవితాన్ని ఎందుకు గడపలేరు?' అన్న విషయంపై ప్రస్తావిస్తూ శ్రీరామకృష్ణులు - "అది చాలా కష్టం! నేను ఒకసారి కలకత్తాలోని బాగ్‌బజార్ వంతెన మీద వెడుతున్నాను. దాన్ని పరీక్షగా చూస్తే అది ఎన్నో గొలుసులతో కట్టబడి ఉంది. వాటిలో ఏ గొలుసు తెగినా ఫరవాలేదు. మిగిలినవన్నీ కలసి దాన్ని సరైన స్థానంలో పట్టి ఉంచుతాయి.

అదే విధంగా ప్రపంచంలో ఉండే మానవులు లెక్కలేనన్ని బంధాలలో చిక్కుకుని ఉంటారు. వాటిలో ఏ ఒకటి తొలగినా మిగిలినవన్నీ కలిసి వాళ్లని ప్రపంచానికి పట్టి బంధించే ఉంచుతాయి. వాటి నుండి తప్పించుకోవడానికి భగవంతుని అనుగ్రహం తప్ప వేరు మార్గమే లేదు."

## డెన్మార్క్‌లో శ్రీబాబూజీ ఆరాధనోత్సవాలు - ప్రసాద రాజు

శ్రీబాబూజీ మహరాజ్‌వారి 26వ పుణ్యారాధనోత్సవాలను వైభవంగా జరుపుకోవాలని ఆ సందర్భంగా సామూహిక గురుపూజ, రుద్రాభిషేకం చేసుకోవాలని సంకల్పించాము. ముందు నుంచీ అందరికీ తెలియజేయటం వలన సుమారు 200మంది భక్తులు హాజరయ్యారు. భారతీమందిర్‌లో 17-11-2014న ఏర్పాటు చేశాము. నమకచమక సహిత రుద్రాభిషేకం ఎంతో వైభవంగా జరిగింది.



అభిషేకం చేయించిన బ్రహ్మగారు, గురుపూజ విధానం గతంలో తెలిసినా తెలియకపోయినా మన గురుపూజ చాలా బాగా చేయించారు. మంత్రాలు చదువుతూ వాటి అర్థం, విశిష్ఠతలను వివరిస్తూ తృప్తిగా చేయించారు. వచ్చిన భక్తులందరికీ ప్రసాదం సరిపడా పెట్టగలిగాం. ఏ మాత్రం వృథా కాకుండా సరిగ్గా సరిపోయింది. బాబూజీయే బ్రహ్మగా వచ్చి పూజ చేయించి, బాబూజీయే స్వయంగా ప్రసాదం తయారుచేసి పంచిపెట్టినట్లుగా అనుభూతి కలిగింది మా అందరికీ.



పూజ, ప్రసాద వితరణ ఎలా జరిగిందో కూడా తెలియలేదు, అంతాపూర్తయ్యాక దివ్యానుభవం, ఆనందం మాకు లభించాయి.

పూజలు ఏర్పాటు విషయంలో ఏ మాత్రం అనుభవం లేని మావంటి వారితో ఈ కార్యక్రమం ఘనంగా జరిపించటం, గురుదేవుడు సంకల్పిస్తే, కుంటి, గ్రుడ్డి, మూగ వారితో కూడ ఏ పనైనా చేయించగలరనే దానికి నిదర్శనంగా అనిపించింది. భారతీ మందిర్‌వారు ఉచితంగా అనుమతించటం కూడా గురు అనుగ్రహమే. విచ్చేసిన భక్తులందరూ 'శ్రీమాతాజీ ఎలా ఉన్నారు? ఎప్పుడు వస్తారు?' అని తరచితరచి అడిగారు.

భగవంతుడు రెండు చేతులిస్తే అందులో కనీసం ఒక చెయ్యి కూడా భగవత్సేవ కోసం, భక్తుల సేవకోసం ఉపయోగించని మా వంటి అజ్ఞానులను గురుదేవుడు భుజాలమీద ఎక్కించుకుని ఆనంద డోలికల్లో ఊగిస్తుంటే, ఏ రోజూ గురుపాదాన్ని స్మరించలేదు. అయినా గురుదేవులు తమ అపార కరుణా కటాక్షం సదా వర్షింపజేస్తూ అందులో మునిగిపోయి అంతులేని ఆనందాన్ని పొందేటట్లు చేశారు.

శ్రీబాబు సిద్ధిపొందిన సమయంలో ఆశ్రమానికి వచ్చి ఒక రోజు రాత్రి శివాలయంలో నిదురించాను. ఆరోజు శ్రీబాబు కలలో దర్శనమిచ్చి "శ్రీ మాతాజీని అనుసరించు" అని ఆదేశించారు. ఆ విషయం ఇన్ని సంవతస్కరాలు ఎలా మరిచిపోయానో? నా అలసత్వం వలన, అజ్ఞానం వలన, మూర్ఖత్వం వలన ఇంతకాలం జ్ఞాపకాలలో అట్టడుగుకు వెళ్ళి పోయినందుకు సిగ్గుపడుతుండగా, గత సంవత్సరం శ్రీమాతాజీ డెన్మార్క్ వచ్చి, మూడురోజులు సత్సంగాలు జరిపి మాకెంతో ఆనందాన్ని యివ్వడమే కాక, ఉపదేశాన్ని అనుగ్రహించారు. శ్రీగురుదేవుల అపార కరుణకు ఇంతకంటె నిదర్శనం ఏం కావాలి? మూడు మండల దీక్షలు రోజుల్లా గడిచిపోయి, 'అప్పుడే అయిపోయాయా!' అనిపిస్తోంది.

పూజ్యులు మా తాతగార్లు శ్రీ నారాయణరాజుగారు, శ్రీసూర్య నారాయణరాజు గార్ల మనుమడిగా పుట్టటం నా దివ్య అదృష్టం. లేకపోతే శ్రీబాబూజీ, శ్రీమాతాజీల కరుణా కటాక్షం లభించేది కాదుకదా! ఎక్కడ ఉండేవాడినో, ఏమయ్యేవాడినో?

శ్రీబాబూజీ, శ్రీమాతాజీల కృపకు పాత్రులమైన మా కుటుంబ సభ్యుల అదృష్టం అపారం. మా జన్మ ధన్యమైనది! జై గురుదేవ్!!

## వెలుగు రవ్వలు

సేకరణ - పరాశర

మనం తెల్లవారినది మొదలు మన ఇంద్రియాల ద్వారా ఈ లోకాన్ని చూస్తున్నాము. అంటే అనుభవిస్తున్నాము. ఈ దశేంద్రియాల ద్వారా మనకు కలిగిన జ్ఞానాన్ని 'ప్రత్యక్ష జ్ఞానము' అంటారు. ఈ ప్రత్యక్ష జ్ఞానము రెండు రకాలు. ప్రమాజ్ఞానము మరియు భ్రమా జ్ఞానము.

ఎన్నిసార్లు చూసినా, ఎందరు చూసినా మార్పు చెందనిది ప్రమాజ్ఞానము. ఉదాహరణకు మంగళగిరి కొండ ఉంది. అది ఎన్ని సార్లు చూసినా, ఎవరు చూసినా అదే కొండ. చూడగానే దాన్ని అందరూ, ఎప్పుడూ కొండ అనే అంటారు. అందుకని ఆ కొండను గూర్చి మనకు కలిగిన ఈ నిశ్చయమైన జ్ఞానాన్ని 'ప్రమాజ్ఞానము' అంటారు.

అలా కాకుండా మార్పు చెందేది భ్రమాజ్ఞానము. నీవు తోటలోకి వెళ్ళావు. అక్కడ దూరంగా తెల్లటి ఏకవస్త్రం కట్టుకొని, కళ్ళజోడు పెట్టుకుని చేతిలో చిన్నబెత్తం పట్టుకుని దూరంగా ఒకాయన కనబడ్డారు. ఒక్క గంతువేసి 'అరుగో! బాబూజీ వచ్చారు!' అంటూ అరచావు. పరుగెత్తి దగ్గరకు వెళ్ళి చూశావు. 'అయ్యో! బాబూజీ కాదే! ఆయన ఎవరో!' అంటూ నిరాశగా ఒక చిరునవ్వు నవ్వుకుని వెనక్కి తిరిగి వచ్చేశావు. మొదట బాబూజీ అని అనుకున్నావే, ఆ జ్ఞానం తరువాత పోయింది. అలాగ పరీక్షవల్ల పోయే జ్ఞానం 'భ్రమాజ్ఞానము' అంటారు.

అంతేకాక నీకే 'బాబూజీ'గాని, ఇతరులకెవరికైనా ఆయన బాబూజీగా కనిపించారా? లేదే. అందరికీ కాదన్నమాట. అంటే ఈ భ్రమ అందరికీ కలుగదు. కొందరికే కలుగుతుంది. ఈ విషయాన్ని వివరిస్తూ గ్రంథాలలో అనేక ఉదాహరణలు చెబుతూవచ్చారు. వాటిలో ముఖ్యమైనది రజ్జుసర్ప భ్రాంతి.

చీకటివేళ ఒక ఆడమనిషి నూతికి నీళ్ళు తేవటానికి వెళ్ళింది. అక్కడ చుట్టుకుని ఉన్న ఒక సర్పాన్ని చూసి కెవ్వుమని 'పాము! పాము!' అని కేక వేసింది. ఊరిలోని పెద్దలందరూ వచ్చి దూరం నుంచి చుట్టుకుని పడుకుని ఉన్న పామును చూసి, దగ్గరకు రావటానికి భయం వల్ల, దానిని చంపటానికి ఉపాయాలను ఆలోచిస్తున్నారు. చర్చలు జరిపారు. ఒకడు దాన్ని కాలిస్తే బాగుంటుందని, మరొకడు రోకలి తీసుకుని దానిపైకి

విసురుదామని, మరొకడు బాణాలతో కొడదామని.... ఇలా రకరకాల ఆలోచనలు జరిపారు. కాని ఏది చేయటానికి ఏవరికీ ధైర్యం చాలలేదు.

ఇంతలో ఒక ముసలి అవ్వ 'చీకటిలో పామును ఏలా కొడతారు?' అంటూ దీపం పట్టుకు వచ్చింది. దీపం వెలుగులో దగ్గరగా వెళ్ళి చూసిన అవ్వ పకపకా నవ్వుతూ "ఓరి వెఱ్ఱి వెంకన్నల్లారా! అది చేంతాడు రా. పాము కాదు. మా పెద్ద కోడలు పెట్టినట్లున్నది అక్కడ" అన్నది. అందరూ పరుగెత్తుకుంటూ దగ్గరకు వచ్చి చూసి నవ్వారు. పాము మీద కోపం చేంతాడు మరచిపోయిన అవ్వ కోడలికి మీదకు మళ్ళింది. ఆమెను తిట్టుకుంటూ ఎవరిండ్లకు వారు చేరారు.

చూశారా! మొదట చీకటిలో 'పాము'గా కనిపించింది. వెలుతురులో త్రాడు అయింది. అంటే చీకట్లో పాము ఉందా? లేదు. అది ఎప్పుడూ త్రాడే. అంటే రజ్జువే. కాని చీకట్లో మీరు దాన్ని మీ భ్రాంతి చేత పాములాగ చూశారు. రాద్ధాంతాం చేశారు. తరువాత తెలివి వచ్చాక అది త్రాడే అని యదార్థ జ్ఞానాన్ని పొందారు.

ఇలాంటివే మరికొన్ని ఉన్నాయి - మరుమరీచి భ్రాంతి - అంటే ఎండమావును నీరు అనుకోవటం ; శుక్త రజిత భ్రాంతి - అంటే ముత్యపు చిప్పను వెండి అనుకోవటం ; స్థాణు పురుష భ్రాంతి - అంటే మొద్దును చూసి మనిషి అనుకోవటం మొదలైనవి.

## పెదనింద్రకొలను శాఖ కార్యక్రమములు

శ్రీసద్గురుమూర్తి ప్రతిష్ఠ ఏకాదశ వార్షికోత్సవం

28-1-2015 బుధవారం నుండి 1-2-2015 ఆదివారం వరకు

ప్రతిరోజు ఉదయం 10గం. నుండి 12గం. వరకు శ్రీ రామానుజదాస్ గారిచే ప్రవచనం.

ప్రతిరోజు సాయంత్రం 6గం. నుండి 8గం. వరకు పూజ్యశ్రీ మాతాజీవారి అనుగ్రహభాషణము.

30-1-2015 శుక్రవారం - భీష్మఏకాదశి, శ్రీసద్గురుదేవుల మూర్తి ప్రతిష్ఠ వార్షికోత్సవము. సామూహిక సద్గురుపాదపూజలు. శ్రీసద్గురుదేవుల తెప్పోత్సవము.

# హరినామ స్మరణ మరువకు

- రమణ ప్రసాద్

"గురుదేవులు సర్వమూ తానై, అంతటా నిండి, ఆశ్రయించిన వారికి ఏలోటూ రాకుండా చూసుకుంటారు. కీ॥శే॥ వెంకటరమణ ప్రసాద్‌గారు 'ఎలా నమస్కారం పెట్టాలా' అని ఆలోచిస్తున్న ఆయనను సడెన్‌గా గురుదేవులు పాదాలపై పడేయటము, ఆయన ఒక అలౌకిక స్థితిని పొందటమూ జరిగింది. ప్రసాదరావుగారే యీ అనుభవాన్ని మాటిమాటికి 'పాదముల్ పట్టిననాడే భవలతల్ దొలగినట్లు' అని పద్యం చదువుతూ ఉండేవారు. వారు శ్రీబాబు గురించి మాట్లాడుతుంటే ఆనందంగా ఉండేది. వారికి వెంకటగిరి నుండి రేపల్లెకు ట్రాన్స్‌ఫర్ అయినప్పుడు సత్సంగాలు ఏర్పాటు చేశారు. "నేనేమీ పుస్తకాలు చదవలేదు" అని శ్రీబాబు అంటే, "పుస్తకం ఎవరిని చదివింది?" అని ప్రసాదరావు గారు అన్నారు. భవబంధాలు తొలగే స్థితి గురు అనుగ్రహం వల్లనే వస్తుంది.

మాయా లోకమురా జీవా
మరువకమురా హరినామ స్మరణము గురునామ స్మరణము
హరియే గురుడురా గురువే హరిరా
గురుపద స్మరణమె చరితార్థమురా

- ఇది గురుదేవుల ముఖస్థగా వచ్చింది. శ్రీబాబు నలుగురు కలసి విచారణ చేసుకోమనేవారు. మనం విచారణ చేయటం లేదు. ఈ కంటికి చూసే శక్తిని, చెవికి వినే శక్తిని ఎవరిచ్చారు? ఇవన్నీ ఒకే వస్తువు నుంచి కదా వచ్చేది. ఆ ఒక్క వస్తువును తెలుసుకుందామని మనం విచారణ చేస్తున్నామా? మనస్సు గుర్తించే విషయంలో జ్ఞానమనేది మొదటి మెట్టు.

'రామ్‌నామ్ జపలేనా ఏ జీవన్ బనాన ఏ జీవన్ దోదిన్ కా ఏ జీవన్ దో దిన్‌కా' - ఈ జీవితం రెండురోజులకే. రామ నామాన్ని జపించు. అడవిలో కట్టెలు అగ్నికి మండిపోతాయి, యీ జీవితం కాగితం వంటిది నీరు పడితే కరిగిపోతుంది యీ జీవితం కూడా అంతే. అటువంటి రామనామాన్ని జపిస్తూ యీ జీవితాన్ని పునీతం చేసుకోవాలి. తాను కాని దానిని తాననుకుంటున్న యీ బొమ్మని ప్రకాశింపజేసేది ఆ పరబ్రహ్మకు ఎటువంటి మార్పు లేదు.

# ముద్గల ఋషి

- కామేశ్వరీ ప్రసాద

మన భారత రత్నగర్భలోని మహర్షులలో శ్రీ ముద్గల మహర్షి ఒకరు. వారు గృహస్థాశ్రమ ధర్మాన్ని స్వీకరించి, నిద్రలేచినది మొదలు రాత్రిపరుండే వరకు భగవన్నామ స్మరణలో గడిపి, భిక్షాటనతో జీవితం గడిపేవారు. దానిలోనే అతిథి అభ్యాగతులను సేవిస్తూండేవారు.

ఒకనాడు నామ సంకీర్తనచేస్తూ భిక్ష స్వీకరించి ఇంటికి వచ్చి భార్యతో "ఈ రోజు ఎక్కువగా భిక్ష దొరికింది. దీనితో వంట చేసి ఈ రోజు మన ముగ్గురు పిల్లలకు కడుపునిండా భోజనం పెట్టు" అన్నారు. ఆ ఇల్లాలు అలాగే వంటచేసి, భగవంతునికి నివేదించి, తినటానికి పిల్లలు అందరూ సిద్ధంగా ఉన్నారు. ఇంతలో ఒక ముదుసలి వచ్చి తాను చాలా రోజుల నుండి తిండిలేక నీరసించిపోయి ఉన్నానని పట్టెడు అన్నం పెట్టమని అర్థించాడు. ఆ భగవంతుడే స్వయంగా ఈ రూపంలో వచ్చాడని భావించి, ఆ భార్యభర్తలిద్దరూ అతిథి పూజలు చేసి అన్నం వడ్డించారు. ఆ బ్రాహ్మణుడు మొత్తం ఆరగించి, ఇంకా ఆకలిగా ఉన్నదని అడిగాడు. తమ స్వార్థాన్ని త్యజించి, పిల్లలకోసం ఉంచిన మొత్తాన్ని కూడా ఆయనకు వడ్డించారు. ఆ బ్రాహ్మణుడు తృప్తిగా ఆరగించి, ఆశీర్వదించి అదృశ్యమయ్యాడు!

ముద్గలమహర్షి నూరు యజ్ఞాలు ఆచరించాడు. ఇంద్రుడు తన దూతలను పంపి స్వర్గాధిపత్యాన్ని స్వీకరించమని కబురుచేశాడు. కాని మహర్షి దానికి నిరాకరిస్తూ "సాక్షాత్ భగవంతుడు నాకు గురు రూపంలో అనుగ్రహించి జననమరణ భయం లేని పరమపదాన్ని అనుగ్రహించాడు. మీ స్వర్గసుఖములు నాకు తృణప్రాయము. ఎన్ని విద్యలు సాంగోపాంగంగా చదివినా, నేర్చినా, గురుకృపను పొంది, లక్ష్యార్థ సాధన చేసినప్పుడే జన్మరాహిత్యం అవుతుంది నాయనా! ఇది నా మాటగా మీ ఇంద్రునకు చెప్పు" అని ఆయన ఆ వచ్చిన దూతలను వెనుకకు పంపించాడు. ఆ విషయం విన్న ఇంద్రుడు "ఆహా! ఆ ముద్గల మహర్షి ఎంత ధన్యుడు! అట్టి మహదానందమును నేను పొందలేకపోయాను కదా!" అని విచారించాడు.

# కుల మతాలకు అతీతుడు పరమాత్మ

(గత సంచిక తరువాయి) - జి.వి

అక్బర్ ఆ సమాధాన పత్రం చదువుకుని మరింత ఆగ్రహావేశుడై 'ఇంత తలపొగరా!' అంటూ హుంకరించాడు. ఆపైన పెట్టెను తెరిపించి చూశాడు. అక్బరుకు దిగ్భ్రాంతి కలిగింది. నోటమాట రాలేదు. పెట్టెలో ఆయనకు కనిపించినవి రాళ్ళు, రప్పలు కావు, అన్నీ రత్నాలే! అన్నీ మణులే! మెహన్‌దాసు జమ కట్టవలసిన సొమ్ముకన్నా అనేక రెట్లు అధికం. ఎంతో సంయమనం పాటించే పాదుషా తన తొందరపాటుకు చింతించాడు. ఒక మహాభక్తుడి పట్ల తన అపరాధానికి నిష్కృతిని గురించి యోచించాడు.

మోహన్‌దాసును వెంటబెట్టుకు రమ్మనమని తన భటులను ఆదేశించాడు. వారు వెళ్ళేసరికి ఆయన ఒక చెట్టు క్రింద ధ్యానసమాధిలో ఉన్నాడు. కొంతసేపు వేచి ఉన్న తరువాత ఆయన కనులు తెరవగానే భటులు ఆయనకు అక్బర్ ఆహ్వానాన్ని అందజేశారు. మొదట ఆయన అందుకు సమ్మతించలేదు. కాని తరువాత అంతరాత్మ ప్రబోధం వల్ల పాదుషా ఆహ్వానాన్ని మన్నించడానికి నిశ్చయించుకుని బయలుదేరి వెళ్ళాడు.



కొలువుదీరి ఉన్న అక్బర్ కనుచూపుమేరలో మోహన్‌దాస్ కనిపించిన వెంటనే ఎదురేగి ఆయనకు సాష్టాంగ ప్రణామం ఆచరించాడు. ఇది గమనించిన సభాసదులు కూడా మిక్కిలి వినయంతో భక్తిపురస్కరంగా నమస్కరించారు.

'మీ వంటి భక్తశిఖామణి నా రాజ్యంలో ఉన్నందుకు ఎంతో సంతోషిస్తున్నాను' అంటూ మోహన్‌దాస్‌ను అక్బర్ తన సింహాసనం వద్దకు తీసుకుపోయి దానిపై కూర్చోబెట్టాడు.

'మీరు నాకు జ్ఞానప్రదాత. ఈ సింహాసనం అధిష్ఠించటానికి అన్ని విధాల మేరే అర్హులు. మీ దర్శనంతో నాలోని అన్ని వాసనలు,

వ్యామోహాలు అంతరించాయి. ఇక మీరే ఈ రాజ్యానికి అధినేత' అంటూ అక్బర్ ఆయనకు పాదపూజ చేసి, రత్నాలు, మణులను కానుకగా అర్పించాడు. మోహన్‌దాస్ పాదాలను అభిషేకించిన పవిత్ర జలాలను తన శిరస్సుపై చల్లుకొని, కృష్ణ తారక మంత్రోపదేశం పొందాడు. అక్బర్ కుటుంబ సభ్యులకు, సామంతరాజులకు, ఇతరులకు కూడా ఆ సందర్భంలో మహద్భాగ్యం కలిగింది.

మోహన్‌దాస్ అభ్యర్థన మేరకు ఆయన తన పరగణాలకు తిరిగి వెళ్ళడానికి అక్బర్ అంగీకరించాడు. అక్కడి రాబడి ఆయన తనకు తోచిన ఉచిత రీతిని భగవదారాధనకు, కృష్ణభక్తి తత్వ ప్రచారానికి వినియోగ పరచేందుకు పూర్తి అధికారం కూడా ప్రసాదిస్తూ సాదరంగా మోహన్ దాస్‌ను సాగనంపాడు.

మతం వేరేనైప్పటికి అక్బర్ ప్రదర్శించిన ఈ విశాల దృక్పథానికి కారణం ఆయనలోగల పారమార్థిక చింతన, ఆధ్యాత్మిక దృష్టికి, పరమాత్మ తత్వం తెలుసుకోవటానికి ప్రాపంచిక విభేదాలు, వివక్షతలు, అడ్డుకావు. భగవద్భక్తిని, ఆధ్యాత్మిక దృష్టిని అలవరచుకోవడం ద్వారా ప్రజలు శాంతి స్నేహ, సామరస్యాలను పెంపొందించుకోవాలి" అని శ్రీబాబు ఉద్బోధించారు.

---

ఒక నక్క భూదేవి దగ్గర ఒక పైసా అప్పుతీసుకుని, ఆ అప్పు ఎగవేయాలి అని ఆలోచించి, రాత్రికి రాత్రి 50మైళ్ళు పరుగెత్తింది. ఒక చోట ఆగి అలుపు తీర్చుకుందామని చూస్తే, కాళ్ళ క్రింద ఉన్న భూదేవి "నా పైసా నాకు ఇవ్వు" అని అడిగింది. అలాగే భగవంతుడు సర్వోపగతుండు!

- వి.వి.ఆర్ ప్రసాద్ రావు

# సత్సంగామృతం

- మురళి

"అన్నిటిలో ఒకటి, ఒకదానిలో అన్నీ అయి, అఖండంలో ఖండత్వం అయి, ఖండత్వంలో అఖండమయి ప్రకాశించేది గురుదేవులు. గురువు ఆరాధన తప్ప మనకు అనుభూతినిచ్చేది ఇంకొకటి లేదు. మనం ప్రేమించేది గురుదేవులను, ఒక భగవానుని, గురుభగవానుని. మీరు ఏ రూపంలో ఆరాధించండి, గురుభగవానుని మనం ఆరాధన చేస్తున్నాం. ఏ విధంగా ఆరాధన చేస్తున్నాము? సనాతనంగా వస్తున్న రూపంలేని అరూపాన్ని, ఒక రూపంలో మనల్ని ఉద్ధరించటానికి ప్రభువు అవకాశం యిచ్చి, మనకు పాదాన్ని అందిస్తే, మనకు ఎలా కనిపిస్తే తృప్తిగా ఉంది. ఒక పుష్పం తీసుకు వెళ్ళి పాదాల మీద పెడితే బాగుంటుంది. ఒక దండ తీసుకువెళ్ళి స్వామికి వేస్తే బాగుంటుంది.



గురుదేవుడు సాకారమే. సాకారానికి ఏది మూలం? నిరాకారం. నిరాకారం అంటే సర్వవ్యాపకంగా ఉన్న అనంత శక్తి. ఆ అనంతమైన గురుశక్తి మనలను ఉద్ధరించటానికి నిరాకారంగా ఉంటే కుదరలేదు. ఒక వ్యక్తిగా అవ్యక్తమే అనుగ్రహించినది. వ్యక్తిత్వం వారికి అవసరం లేదు. కాని, రూపం ఎవరికి అవసరం? మనకు అవసరం. మనం తత్వాన్ని అర్థం చేసుకోవాలంటే రూపం ఉండి తీరాల్సిందే. మనకోసమే మెట్లు దిగారు ఆయన. మనలోనే మనలాగే తిరుగుతూ మనతోపాటు మాట్లాడుతూ మనం అనుకున్నట్లుగా మనం అందించింది తీసుకుంటూ మరలా దానిని ప్రసాదం చేసి మనకందిస్తున్న శ్రీగురుదేవులను ఎలా మరచి పోగలం? ఆ సమర్థవంతమైన పాదం మనకు కావాలంటే దొరుకుతుందా! అరూపమే రూపం ధరించి గురుదేవునిగా వచ్చింది.

శ్రీగురుదేవులకు నిర్గుణ నామాలంటే ఇష్టం. అది నిరాకారము, నిర్గుణము, సర్వవ్యాపకము అయినటువంటిది. అది ఇక్కడ ఉండి, అమెరికాలో లేదని పొరబడకండి. అది దేశకాలాదులకు అతీతమైనది.

స్వామి వర్ణాశ్రమ భేదాలను చాలా మందలించేవారు. ఏ జాతికి

చెందిన వాళ్ళం, ఏ వర్ణం మనది? బయట ఇప్పుడు జాతి జాడ్యం చాల ఎక్కువగా ఉంది. మనమంతా గురుజాతి వాళ్ళం. గురువర్ణం మనది. మనం ఏమీ పొంగక్కర్లేదు. కుంగక్కర్లేదు. గురుపాదం పట్టిన తరువాత గురువులు మనకి నేర్పింది, వారు ఏది సూచించారో అదే మన ధర్మం. గురుధర్మం. జాతి ఎందుకు మనకి. ఎంతోమంది జాతి జాడ్యంలో పడి ఎన్నెన్నో కోల్పోతున్నారు ఇప్పుడు. అక్కడి నుంచి అహంకారం వస్తుంది. క్రోధం వస్తుంది. ఒక్కటేమిటి దాని మూలంగా జ్ఞానం కోల్పోతున్నారు.

'నారాయణ' నామం తలవద్దని తండ్రి చెప్పినా వినలేదు ప్రహ్లాదుడు. 'అతడు తండ్రి మాట వినలేదు అదేమి భక్తి?' అని స్వామిని అడిగినవారు కూడా ఉన్నారు. చెప్పింది తండ్రి. తండ్రి చెప్పినది చేయ వలసిన ధర్మం ఉన్నది కదా. తండ్రి ఎవరో తెలియక ముందే గురువు ఉపదేశం అయింది ప్రహ్లాదుడికి. తల్లి గర్భంలో ఉండగానే 'ఓం నమో నారాయణాయ' అనే మంత్రం ఉపదేశం అయింది. కనుక ప్రహ్లాదుడికి తెలిసిందల్లా 'ఓం నమో నారాయణాయ'. మనం ప్రహ్లాదుడిలాగ ధైర్యంగా ఉండాలి. మనం సమర్థులైన గురుదేవుల బిడ్డలం కాదా? నువ్వు కాదేమో, ఇతర చింతన చేస్తున్నావేమో దుఃఖించు నీ కర్మ. ఏం చేస్తాం. నేను చచ్చిపోతే యిదంతా ఏమైపోతుంది అనుకుంటూ ఉంటే, ఖర్మని కావాలని పూసుకుంటూ ఉంటే నీ ఖర్మ. ప్రహ్లాదుడికి భయం లేదు. ఎంతో ఆత్మ స్థైర్యం ఉంది. 'నా ప్రభువు ఉన్నాడు' అంతే. భగవంతుడు అడుగడుక్కి ఎంత రక్షణ చేసుకున్నాడు! తల వంచాల్సింది ఎవరు? హిరణ్యకశిపుడు వంచవలసి వచ్చింది.

ఇందుగలడందు లేడని సందేహంబు వలదు. చక్రి సర్వోప గతుండు. ఎందెందు వెదకి చూసినా అందందే గలడు. నువ్వు వెతికి చూడాలి కదా. వెతికి చూడటం నేర్చుకోవాలి. నా ప్రభువు లీల ఎలా ప్రకాశిస్తోంది, ప్రభువ దయ అనుగ్రహం ఎలా పొంగి పొరలుతోంది అనే విషయాన్ని ముందు నువ్వు గుర్తించాలి. వెతికితే ఎక్కడ లేడు భగవంతుడు? రూపనామాలకు అలవాటు పడిపోయి, రాముడి గుడి ఎక్కడ? కృష్ణుడి గుడి ఎక్కడ? - ఇద్దరూ నారాయణమూర్తి అవతారాలే కదా - అని రూపనామ భేదాలు పెట్టుకుని మానవుడు వెతుకుతున్నాడు గాని, ఆ భగవంతుడనేవాడు మనతో లేకపోతే నీ జీవితం ఎలా నడుస్తోంది?" అన్నారు శ్రీమాతాజీ.

- సశేషం

(గత సంచిక తరువాయి) **హనుమద్వైభవము** - సుషుమ్నా ప్రసాద

హనుమంతుడు సీతాన్వేషణకై సముద్రాన్ని లంఘించాడు. సాగరం దాటుతుండగా, వాయుదేవుని వలన లబ్దిని పొందిన మైనాకుడు వాయుపుత్రుని ఒక్కింత సేద తీర్చుకుని, తన ఆతిథ్యాన్ని స్వీకరించమని ప్రార్థించాడు. కాని హనుమాన్ సున్నితంగా నిరాకరించాడు. ఎందుకంటే, కార్య శూరుడు, కార్యోన్ముఖుడయిన ధీశాలి, తన కార్యం సాధించేవరకు ఎటువంటి ప్రలోభాలకు లోనుకాడు. హనుమ తన దృష్టిని ఏకోన్ముఖం చేసి, సముద్రం దాటుతుండగా, సురస అనే నాగమాత, అడ్డువచ్చి తనకాహారంగా రమ్మని కోరింది. హనుమంతుడు "నేను స్వామి కార్యార్థమై వెడుతున్నాను, కార్యం సాధించిన తరువాత తిరుగు ప్రయాణంలో తప్పక నీ కోరిక తీరుస్తాను' అన్నాడు. కాని ఆమె అంగీకరించ లేదు. హనుమ కామరూప వర ప్రభావంతో తన శరీరాన్ని విపరీతంగా పెంచాడు. సురస కూడా తన నోటిని అంతగా పెంచింది. అప్పుడు సమయస్ఫూర్తితో హనుమ తన శరీరాన్ని సూక్ష్మం చేసి, ఒక తృటికాలంలో ఒక కీటకంగా మారి ఆమె నోటిలోకి ప్రవేశించి, మరల అంతే వేగంతో బయటకు వచ్చి, తన సహజరూపాన్ని దాల్చి సురసకు నమస్కరించి, "అమ్మా! మీ గర్భాన్ని తాకి వచ్చాను కాబట్టి నేను మీ పుత్ర సమానుడను. నన్ను ఆశీర్వదించి పంపవలసినది" అని కోరాడు. వెంటనే సురస తనపెట్టిన పరీక్షలో హనుమ నెగ్గినందుకు సంతోషించి, 'నీ కార్యం సఫలీకృతమవు గాక!' అని ఆశీర్వదించినది.



మరల హనుమ తిరిగి ప్రయాణం కొనసాగించాడు. అతని నీడను సింహిక వెంబడించి, హనుమంతుని కబళించబోయింది. వెంటనే మారుతి ఆమెను పట్టి సంహరించాడు.

సముద్రాన్ని లంఘించి, లంకానగర ముఖ ద్వారం వద్దకు వచ్చాడు. అక్కడంతా నిశితంగా పరిశీలించి, సూక్ష్మరూపం దాల్చి, లంకా

నగరిలో ప్రవేశించబోతుంటే అక్కడ కాపాలాకాసే లంకిణి అడ్డుకుంది. ఆమెను తన ముష్టిఘాతంతో అడ్డుకుని మూర్ఛిల్లేటట్లు చేశాడు పవన సుతుడు. అలా మూడు మాయలను అధిగమించాడు.

సురస సాత్విక మాయకు ప్రతీక. అందుకని ఆమెకు నమస్కరించి బయలుదేరాడు. సింహిక తామసిక మాయకు ప్రతీక. అందుకామెను సంహరించాడు. లంకిణి రాజసిక మాయకు ప్రతీక. కావున ఆమెను కొట్టి మూర్ఛిల్లేటట్లు చేశాడు. అలా మూడు మాయలను అధిగమించి, లంకలో సీతాన్వేషణ ప్రారంభించాడు.

రాత్రిపూట రావణాసురుని అభ్యంతమందిరాలలో అంతఃపుర కాంతలను నిశితంగా గమనించటం ప్రారంభించాడు. సూక్ష్మరూపాలలో భవనాలపై సంచరించాడు. సీతామాత ఎక్కడా కనబడలేదు. ఒక శయన మందిరంలో ప్రశాంతంగా నిద్రిస్తున్న సౌందర్యరాశి మండోదరిని చూసి, లక తృటికాలం 'మా యమ్మ సీతమ్మ కాబోలు!' అని భ్రమించాడు. వెంటనే సీతమ్మ తల్లి యింత ప్రశాంతంగా ఎలా నిదురపోగలదని తన్ను తాను నిందించుకున్నాడు.

తరువాత అశోకవనంలో ప్రవేశించి, వనమంతా నిశితంగా పరిశీలించి, అశోక వృక్ష నీడలో కృశాంగియై మాసిన వస్త్రాన్ని ధరించి, అగ్నిశిఖలా ప్రకాశిస్తూ, మూర్తీభవించిన శోకదేవతలా ఉన్న కరుణామయి అమ్మను చూశాడు. 'ఈమే మా సీతమ్మ తల్లి' అని నిర్ధారణకు వచ్చి, ఆనందంతో ఉప్పొంగిపోయాడు. వచ్చిన కార్యం సఫలీకృతం అయి, మమతామూర్తి మాతృదర్శనం అయినదంటే అంతకంటె ఆనందం ఏముంటుంది?

ఆంజనేయస్వామి జితేంద్రియుడు. అర్ధరాత్రి వివిధ అభ్యంతర భంగిమలలో, శృంగార క్రీడలలో అలసిపోయి నిద్రిస్తున్న అంతఃపుర కాంతలను రావణాంతఃపురంలో సీతాన్వేషణలో నిశితంగా చూడటం జరిగింది. 'ఇది సమంజసమా!' అని ఆత్మవిమర్శ చేసుకున్నాడు. ఏకాగ్ర దృష్టితో సీతాన్వేషణకై పరితపిస్తున్న మారుతికి ఇంద్రియదృష్టి ఇసుమంతైన లేదు. వారందరిని మాతృభావనతో చూశాడు. ఇహ జితేంద్రియుడు అన్న పదము హనుమకే చెల్లు!

- సశేషం

# సమర్థ సద్గురు నాథుని దివ్య చరిత్ర

(గత సంచిక తరువాయి) - విజయేశ్వరానంద ప్రసాద్

మేము యిటు స్టేషన్‌కు వెళ్ళామో లేదో, గురువుగారి కుమార్తె మరణ వార్త టెలిగ్రాం వచ్చింది. ఆ టెలిగ్రాం చూసి దిగ్భ్రాంతి చెందిన గురువుగారికి, మరుక్షణంలోనే మెరుపు మెరిసి నట్లుగా మా నెపంతో తనచేత బోధ ఎందుకు చెప్పించారో అర్థం అయింది. పిడుగు వంటి ఆ వార్త విన్నప్పుడు, తాను స్థితప్రజ్ఞురాలై నిలప గలగటం కోసమే ఘటనాఘటన సూత్రధారియైన శ్రీబాబు ఈ నాటకం ఆడించారని గ్రహించారు.



గురువుగారి తండ్రిగారు పావులూరి వెంకట సుబ్బారావుగారు చాలా అనుష్ఠానపరులైన హనుమద్భక్తులు. ఒంగోలులో ఉండేవారు. వారి అవసాన సమయంలో, శ్రీబాబు తమ దక్షిణ యాత్ర ముగించుకుని, భక్తులతో కలసి వస్తూ మద్రాసులో ఉన్నారు. గురువుగారు కూడా వెంట ఉన్నారు. తండ్రిగారి ప్రమాద పరిస్థితిని గురువుగారికి తెలిపి శ్రీబాబు "నువ్వు వెంటనే ఒంగోలు వెళ్ళిపో. నేనూ నీ వెనుకనే వస్తాను" అని పంపించారు.

అప్పటికే సుబ్బారావుగారు స్పృహ లేకుండా ఉన్నారు. నోట్లో ఏది పోసినా గుటక పడటం లేదు. శ్రీబాబు మద్రాసు నుంచి ముందుగా చీరాల వెళ్ళి, అక్కడి భక్తులు పాదపూజ చేసుకున్న తరువాత ఒంగోలు వచ్చారు. శ్రీబాబు సరాసరి సుబ్బారావుగారి దగ్గరకు వెళ్ళి శ్రీగురుపాద తీర్థాన్ని వారి నోట్లో పోశారు. ఆశ్చర్యం! సుబ్బారావుగారు మూడు గుటకలు వేసి, ఆ తీర్థం తీసుకోగలిగారు. వెంటనే శ్రీబాబు తిరిగి వెళ్ళిపోవటం, వారి కారు గేటు దాటుతుండగానే, సుబ్బారావుగారు తుది శ్వాస విడవటం జరిగింది. శ్రీబాబు అనుక్షణ భక్తరక్షణకిది మరొక ఉదాహరణ మాత్రమే.

'హనుమాయమ్మ' గారిని అసలు 'గురువుగారు' అని ఎందుకు పిలిచేవారు?

ఒక ప్రసిద్ధ గురు సంప్రదాయంలో ఎంతో శిక్షణ పొంది, పండితుల సమక్షంలో అపార పాండిత్యాన్ని గణించి, సమర్థ సద్గురు

దేవుల సత్యగురు లక్షణాలను శ్రీబాబులో గుర్తించి, విశ్వసించి, ఆశ్రయించి సేవించుకున్నారు గురువుగారు. అలా తాను తరించే దోవ చూసుకోవటమేకాక, తమ బంధువులకు కూడా ఆ త్రోవ చూపించారు. అంతటితో సరిపెట్టుకోక, శ్రీబాబు భక్త సోదరసోదరీమణులందరికీ తమ దివ్యానుభవ నిధులను అందించారు. వారికి కూడా సమర్థ సద్గురు దేవుల నిజతత్వాన్ని అనన్య గోచరమైన వారి ఆత్మజ్ఞానవైభవాన్ని విశద పరచారు. వారిని కూడా తనతో పాటు ఆ తరించేమార్గంలో పయనింప జేయాలన్నదే ఆవిడ తపన.

భక్త సోదరీసోదరుల యెడల ఆమెకు గల అనూహ్యమైన నిస్వార్థ ప్రేమ అందరి హృదయాలలోనూ చెరగని ముద్ర వేసింది. సమయాన్ని మరచి, తన ఆరోగ్యాన్ని కూడా లెక్కచేయకుండా గురువుగారు మహదానందంతో శ్రీబాబును దర్శించ వచ్చిన భక్తులకు విందుభోజనాలే కాక, ఆత్మవిద్యా బోధను కూడా విసుగు విరామం లేకుండా అందించారు. ఆ సేవను కూడా గురుసేవగానే భావించి, అటువంటి సేవా తత్పరతను, త్యాగనిరతిని అందరికి ఆదర్శప్రాయంగా ఆచరించి చూపించిన ఆ మహాత్మురాలిని, ఆ మార్గదర్శకురాలిని 'గురువుగారు' అని అందరూ ఆత్మీయంగా పిలుచుకోవటంలో ఆశ్చర్యమేమున్నది?

శ్రీబాబు తమ భక్తులందరికీ గురువుగారితో భగవద్గీత, ఉపనిషత్తులు, స్తోత్రాలు నేర్పించారు. గురువుగారు ఎంతో ఓపికతోను, శ్రద్ధతోను, బద్ధకస్తులైన వారికి కూడా ఆసక్తి కలిగే విధంగా చిన్నచిన్న కథలతో, కబుర్లతో గురుతత్త్వ నవనీతాన్ని అందించారు.

ముఖ్యంగా శ్రీసద్గురుపాదపూజ ఎలా చేసుకోవాలో, ఆ విధానానికి ఒరవడి పెట్టి, గురువుగారు చక్కగా తీర్చిదిద్దారు. తాము స్వయంగా ఉండి పాదపూజ చేయిస్తూ అందరినీ తమతోబాటు అనుసరింప జేసేవారు. ఆశ్రమవాసులందరూ సంస్కృత భాష నేర్చుకోవాలని శ్రీబాబు అభిలషించారు. గురువుగారు తామే స్వయంగా సంస్కృత బోధనా తరగతులను నిర్వహించేవారు. పరీక్షలకు కట్టి వ్రాయించేవారు. పూజ్యశ్రీ మాతాజీ, మరికొంత మంది భక్తులు కూడా వారి ప్రోత్సాహ ప్రోద్బలాలతో ఉత్తీర్ణులయ్యారు.

- సశేషం

విష్ణు  కథలు - రమణ ప్రసాద్

(గత సంచిక తరువాయి)

## కబీర్‌దాస్

భక్తి జ్ఞానాలతో పాటు కబీరులో వైరాగ్యం నిండింది. ప్రపంచం అంతా నిస్సారంగా గోచరించేది. అనుక్షణం జీవితం యొక్క అస్థిరత్వమే కళ్ళకు కట్టినట్లు కనిపించేది.




మాలీ ఆవత్ దేఖి కే కలియాఁ కరీ పుకార్।

ఫూలీ ఫూలీ చున్‌లాయీ కాల్ హమారీ బార్॥

"సమీపిస్తున్న తోటమాలిని చూసి మొగ్గలు వికసించాయి. విరబూసిన పువ్వులు ఈ రోజు కోయబడ్డాయి. మన వంతు రేపు వస్తుంది. మృత్యువుతో ఆలింగనం చేసుకోక తప్పదు" అని మొగ్గలు విలపిస్తున్నట్లు చింతిస్తాడు కబీర్.

ఒకసారి కబీర్ నడిచి వెడుతున్న దారిలో ఒక చోట ఒక స్త్రీ జొన్నలు తిరుగలిలో వేసి తిప్పుతున్న దృశ్యాన్ని చూసి దుఃఖం పొంగి పొరలి వచ్చింది. హృదయాన్ని ఎవరో పిండుతున్నట్లు అనిపించింది. అదే సమయానికి నిపట నిరంజన్ అనే సాధువు వచ్చి "ఎందుకు దుఃఖిస్తున్నావ్?" అని అడిగాడు. "మహాత్మా! అటు చూడండి! ఆ స్త్రీ తిరుగలిలో జొన్నలు వేసి పిండి విసురుతున్న దృశ్యం చూడండి. సంసారమనే తిరుగలిలో జొన్నలు అనే జీవులను వేసి మృత్యువు అనే స్త్రీ ఎలా పిండి చేస్తోందో చూడండి. పిండిలా మారిన జీవులు మృత్యువాత పడి మరణిస్తున్నారు.

చలతీ చాకీ దేఖకే దియా కబీరా రోయ్ ।

దో పాటన్ కే బీచ్‌మే, సాబిత్ బచా న కోయ్ ॥

"తిరగలి రాళ్ళ మధ్యన నలుగుతున్న జొన్నలను చూసి కబిర్ దుఃఖించాడు. ఎందుకంటే అన్నీ నలిగి పిండి అయిపోతున్నాయి. నలగని గింజ ఒక్కటికూడా మిగలలేదు.

నిపట నిరంజనుడు -

చాకీ చలతే చాలనదో తూక్కోం ఉదాస్ హోయ్।
కీల్‌కే సంగ్ లగా వహీ బాలన బాకా కోయ్॥

"తిరగలి తిరుగుతోంది, తిరగనీయి. బురుజును ఆశ్రయిస్తే ఏమీ కావు. అలాగే సంసారం అనే తిరుగలిలో పడినా ఎవరైతే భగవానుడిని ఆశ్రయించి ఉంటారో వారు మృత్యువాత పడరు." ఆ మహాత్ముని బోధకు కబీరు ప్రభావితుడయ్యాడు. భగవన్నామామృత పానమే తన దినచర్య అయింది. ఎవరైనా జ్ఞాపకం చేస్తే గాని భోజనానికి వచ్చేవాడు కాదు. నిద్ర అందని అనుభూతిగా మిగిలింది. కుమారుని ధ్యానాభిలాషను గుర్తించిన తండ్రి "నీరూ" కబీర్‌కు ఏ పనీ అప్పచెప్పకుండా తానే నేతపని చేసి ఇంటిని పోషించేవాడు.

కాలచక్రం ముందుకు నడిచింది. "నీరూ" కన్ను మూసాడు. కుటుంబ భారం అంతా కబీర్ పై పడింది. కబీరులో వైరాగ్యం తీవ్ర స్థాయినందుకుంది. బట్టలు నేసి సంసారాన్ని పోషించమని తల్లి ఒత్తిడి చేయగా, కబీరు గుడ్డలు నేసే పనికి ఉపక్రమించాడు. గుడ్డలు నేస్తూనే రామ ధ్యానంలో మైమరచేవాడు. తల్లి వచ్చి మధ్య మధ్యలో హెచ్చరించేది. కబీరు బట్టలు నేస్తూ -

"ఈ దారంతో మనం వస్త్రం నేస్తున్నట్లే ,భగవంతుడు అష్ట కమలాలతో, పంచ తత్త్వములనే రేకులతో మానవుణ్ణి సృష్టి చేశాడు. మానవుడు వాస్తవానికి భగవంతుడే అయినా ప్రాపంచిక విషయాలలో పడి తన యదార్థ తత్త్వాన్ని మరిచిపోతున్నాడ"ని బాధపడేవాడు. "గురూపదేశాన్ని పాటించు. నిర్మలత్వాన్ని పొందుతావు. గురువుని సందేహించకు. గురువుని నరునిగా ఎంచకు" అని కబీరు ప్రజలకు ప్రబోధం చేశాడు. కబీరు పలికిన ప్రతి వాక్కూ ఒక హెచ్చరికే! మానవుణ్ణి జ్ఞాన మార్గాన నడిపించేదే!

- సశేషం

Printed, and Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL